
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

కృష్ణా
జిల్లా వార్తలు
సోమవారం 21 అక్టోబరు 2024



డ్రోన్లొచ్చాయ్!

ఆకాశం అదిరేలా రేపు, ఎల్లుండి డ్రోన్ షో

- బబ్బూరి గ్రౌండ్స్‌కు చేరిన 5 వేల డ్రోన్లు
- షోకు సిద్ధం చేస్తున్న నిర్వాహకులు
- సెన్సార్లు, బ్యాటరీలు తనిఖీ
- పూర్తి కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ద్వారా డ్రోన్ షో

వీక్షకుల కోసం పున్నమి ఘాట్‌లో గ్యాలరీలు ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడకు డ్రోన్లొచ్చాయ్.. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఐదు వేల డ్రోన్లు వచ్చాయ్. ఆకాశమే హద్దుగా మంగళ, బుధవారాల్లో షో నిర్వహిం చేందుకు డ్రోన్లన్నీ సిద్ధమయ్యాయి. ఆదివారం బబ్బూరి గ్రౌండ్స్‌కు పెద్ద ఎత్తున డ్రోన్ ఆపరేటర్లు చేరుకున్నారు. పూర్తి కంప్యూటరైజ్డ్ విధానంలో నడిచే ఈ డ్రోన్ షోకు డ్రోన్లను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. డ్రోన్లను సీరియల్ నంబర్‌గా వరుస క్రమంలో పెడుతున్నారు. డ్రోన్లలోని బ్యాటరీలను తీసి ఫుల్ చార్జింగ్ పెట్టడంతో పాటు వాటిని కూల్ చాంబర్లలో ఉంచుతున్నారు. మొత్తం ఐదు వేల డ్రోన్లలో ఏ ఒక్క డ్రోన్ కూడా షో సందర్భంలో ఇబ్బంది పెట్టకుండా ఉండటానికి వీలుగా వాటిని సంసిద్ధం చేస్తున్నారు. ఈ డ్రోన్లన్నీ కూడా పూర్తి సెన్సార్లతో కూడుకుని ఉంటాయి. ఒక డ్రోన్‌కు మరో డ్రోన్ టచ్ కాకుండా ఉంటాయి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ద్వారా సెన్సార్లకు వచ్చే సిగ్నల్స్ ఆధారంగా డ్రోన్లు ముందుకు కదులుతాయి. డ్రోన్ షోలో ప్రదర్శించే చిత్రాలను ముందుగా ప్రోగ్రామింగ్ చేస్తారు. సెన్సార్లకు వచ్చే సిగ్నల్స్ ద్వారా వెంటనే నిర్దేశిత ప్రదేశాలలో డ్రోన్లు ఉంటాయి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ఇచ్చే ఆకృతిలో ఏ డ్రోన్ ఎక్కడ ఉండాలో సెన్సార్ల ద్వారా ఆయా డ్రోన్లకు సంకేతాలు అందుతాయి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ద్వారా ఆకాశంలో డ్రోన్లు చేసే విన్యాసాలు అన్నీ ఇన్నీ కావు. డ్రోన్లకు ఉండే సెన్సార్లు చాలా సున్నితంగా ఉంటాయి. సెన్సార్లు దెబ్బతింటే 'షో' కు ఇబ్బంది ఎదురవుతుంది. అందువల్ల సెన్సార్ల పనితీరును ఆదివారం డ్రోన్ ఆపరేటర్లు పరీక్షించారు. ఇలా ఐదు వేల డ్రోన్లకు సంబంధించిన సెన్సార్లను పరీక్షించారు.

వీక్షకుల కోసం ప్రత్యేక గ్యాలరీలు

డ్రోన్ షో ఈవెంట్‌కు భారీగా తరలివచ్చే సందర్శకుల కోసం మరో వైపు పున్నమి ఘాట్‌లో పెద్ద ఎత్తున గ్యాలరీల నిర్మాణం చేపడుతున్నారు. ఈ గ్యాలరీలలో భారీ సంఖ్యలో సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలు, సందర్శకుల కోసం వేర్వేరుగా గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు

బబ్బూరి గ్రౌండ్స్‌లో వీక్షకులకు ఆనందాన్ని పంచేందుకు పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితో పాటు ముంబై డ్యాన్సర్లతో ప్రత్యేక షో నిర్వహించనున్నారు.



మచిలీపట్నంలో మొక్కలు తొలగిస్తున్న మంత్రి రవీంద్ర

స్వచ్ఛ బందరు సాధనకు కలిసి పనిచేద్దాం

6లో

- రోడ్లు శుభ్రం చేసిన మంత్రి రవీంద్ర, కూటమి నేతలు



భళారే ఖిల్లా

కొండపల్లి కోటకు దశాబ్దాల చరిత్ర

రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో ఒకటిగా గుర్తింపు

- కట్టిపడేస్తున్న ప్రకృతి అందాలు.. జలపాతాల హొయలు
- నాడు టీడీపీ పాలనలో రూ.10 కోట్లతో ప్రత్యేక హంగులు
- కూటమి ప్రభుత్వంలో పూర్వ వైభవం వచ్చేనా!

పచ్చని చెట్లు.. ఎత్తైన కొండలు.. హోయలొలికే జలపాతాలతో ప్రకృతి ప్రేమికుల మనస్సు దోచుకుంటోంది కొండపల్లి ఖిల్లా. తెలుగు నాట ఎంతో ప్రాచుర్యం పొందిన గిరిదుర్గం దశాబ్దాల చరిత్రకు ఆనవాలుగా భాసిల్లుతోంది. శత్రుదుర్భేద్యమైన ఈ దుర్గం మూడంస్తుల రాతి బురుజు, భారీ ప్రాకారం, రాజమహల్, రాణి మహల్, నర్తనశాల, అంగడి, కారాగారం, ఆయుధాగారం, కొలనులు, కళాఖండాలు, వీరుపాక్షి దేవాలయం, లోతైన జలాశయం, ధాన్యాగారం ఇలా అనేక చారిత్రక ఆధారాలకు నిలయంగా కొనసాగుతోంది. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో ఒకటిగా వెలుగొందుతోంది. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం రూ.10 కోట్లు వెచ్చించి కోటకు కొత్త రూపు తీసుకువచ్చింది. పర్యాటకులు మెచ్చిన పచ్చని 'కోట'పై ప్రత్యేక కథనం.

8

వీఎంసీ నోటీసులు.. ఆడిట్ అలక!



స్టేట్ ఆడిట్ కార్యాలయం


దసరా ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయన్న ఆనందంలో ఉన్న దుర్గగుడి అధికారులకు ఇటు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, అటు ఆడిట్ శాఖ షాక్ ఇచ్చాయి. కోట్ల రూపాయల పన్నులు చెల్లించాలంటూ కార్పొరేషన్ అధికారులు నోటీసులు ఇవ్వగా, అమ్మవారి దర్శనం సరిగా చేయించలేదని పెట్టిన బిల్లులు చేయకుండా ఆడిట్ అధికారులు అలక వహించారు. దీంతో బిల్లులు అవ్వక, పన్నులు కట్టలేక దుర్గగుడి అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఉన్నతాధికారులు చొరవచూపి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

దుర్గగుడిపై రెండు శాఖల ముప్పేట దాడి

రూ.5.34 కోట్ల పన్ను కట్టాలని దుర్గగుడికి వీఎంసీ నోటీసు

మహామండపం, రాజగోపురానికి రూ. 2.36 కోట్లు

- సీవీ రెడ్డి చారిటీస్‌కు రూ.2.98 కోట్లు చెల్లించాలని స్పష్టం
- దసరాలో మమ్మల్ని పట్టించుకోలేదంటూ ఆడిట్ అధికారుల అలక
- దసరా బిల్లులు నిలిపివేత.. తలలు పట్టుకుంటున్న దుర్గగుడి అధికారులు



శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానంపై రెండు ప్రభుత్వ శాఖలు ముప్పేట దాడికి దిగాయి. భారీ మొత్తంలో పన్ను

(విజయవాడ/వన్‌టౌన్-ఆంధ్రజ్యోతి) బకాయిలు చెల్లించాలని దుర్గగుడికి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆదివారం డిమాండ్ నోటీసులు ఇచ్చారు. సుమారు రూ.5.34 కోట్లు చెల్లించాలంటూ దుర్గగుడి ఈవో రామారావును నేరుగా కలిసి కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ సృజన, సర్కిల్ -1 సహాయ కమిషనర్ ఎలీనా ఈ నోటీసులు అందజేశారు. రాజగోపురం, మహామండపం నిర్మాణం చేసినప్పటి నుంచి పన్ను చెల్లించాలని నోటీసులో పేర్కొనడంతో దుర్గగుడి అధికారులు కంగుతిన్నారు. 2025 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరం వరకు రూ.2.36 కోట్లు బకాయిలు చెల్లించాని నోటీసులో తెలిపారు. వన్‌టౌన్ పాడి వీధిలోని సీవీరెడ్డి చారిటీస్‌కు చెందిన నిర్మాణాలకు 2011 నుంచి రూ.2.98 కోట్లు బకాయిలు ఉన్నాయని స్పష్టం చేశారు. గతేడాది సీవీరెడ్డి చారిటీస్ నిర్మాణాలకు సంబంధించి రూ.39 లక్షల పన్నును దుర్గగుడి అధికారులు చెల్లించారు. అనంతరం ఈ అంశాన్ని దేవదాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఆ సమయంలో దేవదాయశాఖ కమిషనర్ హిందూ ధార్మిక సంస్థలకు చెందిన నిర్మాణాలకు నోటీసులు ఇవ్వరాదంటూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో తాజా నోటీసులు కలకలం రేపుతున్నాయి. వీఎంసీ అధికారులు ఆదివారం నోటీసులు జారీ చేసి మహామండపంలోని అన్ని అంతస్థులు, అక్కడ ఉన్న షాపులను పరిశీలించారు.

అమ్మవారి దర్శనానికి వస్తే రాచమర్యాదలు చేయలేదని..

ఇంద్రకీలాద్రిపై ఇటీవల జరిగిన దసరా మహోత్సవాలలో తాము అమ్మవారి దర్శనానికి వస్తే రాచమర్యాదలు చేయలేదన్న కారణంగా విజయవాడ బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డిలో ఉన్న స్టేట్ ఆడిట్ కార్యాలయం అధికారులు దుర్గగుడికి సంబంధించిన బిల్లులు వేటినీ మంజూరు చేయకుండా నిలిపివేసినట్లు సమాచారం. ప్రీ ఆడిట్ చేయకుండా బిల్లులు తొక్కి పెట్టడంతో దసరా పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కాక ఆలయ అధికారులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దసరా మహోత్సవాలలో అమ్మవారి దర్శనం కోసం వీఐపీలకు టైం స్లాట్‌లను కేటాయించారు. వివిధ పాయింట్ల నుంచి వీఐపీలు వచ్చేందుకు ప్రత్యేక వాహనాలను కూడా ఏర్పాటు చేశారు. దీనిపై విస్తృత ప్రచారం కూడా చేశారు. అయితే దుర్గగుడికి చెందిన జమ్మిదొడ్డి కార్యాలయంలోనే ఉంటున్న స్టేట్ ఆడిట్ కార్యాలయం నుంచి కొందరు అధికారులు ఈనెల 10న అమ్మవారి దర్శనం కోసం వచ్చారు. ఆడిట్ విభాగం కోసం ఒక కారును కేటాయించారు. అయితే మరో కారుకు కూడా పాస్ అడిగారు. దుర్గగుడికి వచ్చే వీఐపీల తాకిడి దృష్ట్యా రెండో కారుకు పాస్ ఇవ్వలేకపోయారు. ఈ నేపథ్యంలో 10న అమ్మవారి దర్శనం కోసం వచ్చిన ఆడిట్ అధికారులను ఓం టర్నింగ్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వారి వద్ద రూ 500 టికెట్లు కూడా లేకపోవడంతో దర్శనానికి అనుమతించలేదు. ఆడిట్ అధికారులు తాము నేరుగా వెళ్లాల్సిందేనని, తమకు ప్రొటోకాల్ వర్తిస్తుందని పోలీసులతో చెప్పారు. వారితో అరగంట పాటు వాగ్వాదం జరిగినా ఆడిట్ అధికారులు అక్కడే ఉండిపోయారు. ఇంతలో విషయం తెలుసుకున్న దుర్గగుడి అధికారులు వారి వద్దకు వచ్చి దగ్గరుండి అమ్మవారి దర్శనం చేయించారు. ఈ విషయంపై తీవ్ర మనస్థాపానికి గురైన ఆడిట్ అధికారులు ఇప్పుడు దుర్గగుడికి చెందిన దసరా బిల్లులను వేటినీ ప్రీ ఆడిట్ చేయకుండా నిలిపివేశారు. దుర్గగుడి అధికారులు అడుగుతున్నా సమాధానం ఇవ్వడం లేదు. పెద్ద మొత్తాలకు సంబంధించిన బిల్లులు ఆగి పోవడంతో దసరా పనులు చేసిన వాళ్లకు చెల్లింపుల కోసం తమపై ఒత్తిడి పెరుగుతోందని దుర్గగుడి అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయం



ఏడాదిన్నరగా వెతుకుతున్నారు!

నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం ఏర్పాటులో నిర్లక్ష్యం

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం ఏర్పాటులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఏడాదిన్నరగా భవనం వెతికే పనిలోనే ఉన్నారు. 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రెండు మండలాల కల తీరిందన్న ఆనందం కూడా తమకు లేకుండా చేస్తున్నారని నియోజకవర్గ ప్రజలు విమర్శిస్తున్నారు.

- మచిలీపట్నం నియోజకవర్గం ఉత్తర, దక్షిణ మండలాలుగా విభజన
- రెండో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు 2023 లోనే అనుమతి
- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ ప్రజలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం నగరంలోని 50 డివిజన్‌లతో పాటు, మండలంలోని 34 గ్రామ పంచాయతీలు గతంలో ఒకే తహసీల్దార్ కార్యాలయం పరిధిలో ఉండేవి. దీంతో పరిపాలనా సౌలభ్యం కోసం మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయాన్ని ఉత్తర, దక్షిణ మండలాలుగా విభజించారు. ప్రస్తుతం ఉన్న పాత కార్యాలయంలో ఉత్తర మండలాన్ని కొనసాగించాలని, దక్షిణ మండలానికి నూతన కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దక్షిణ మండల కార్యాలయానికి రెండు, మూడు భవనాలు చూసినా కార్యాలయం మాత్రం ఏర్పాటు చేయలేదు. ఇటీవల జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో రెండు మండలాలకు తహసీల్దార్లను నియమించారు. రెవెన్యూ రికార్డుల్లో రెండు మండలాలుగా ఉన్నా ఒకే కార్యాలయంలో పరిపాలన కొనసాగిస్తున్నారు. దక్షిణ మండలానికి నూతన కార్యాలయం ఏర్పాటు చేయకుండా జాప్యం చేస్తున్నారు.

ఏడాదిన్నర గడిచినా సమకూరని కార్యాలయం

మచిలీపట్నం నగరం, మండలాన్ని రెండు తహసీల్దార్ కార్యాలయాలుగా విభజిస్తూ 2023, ఫిబ్రవరి 28న ప్రభుత్వ జీవో ఆర్‌టీ నంబరు 213ను జారీ చేసినా నేటికీ రెండవ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయలేదు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం దృష్టిలో మచిలీపట్నం నియోజకవర్గంలో రెండు మండలాలు, ఇద్దరు తహసీల్దార్లు ఉన్నట్లుగా చూపారు. దక్షిణ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని తొలుత నోబుల్ కళాశాల ఎదురుగా ఉన్న బందరు బీడీ, కిళ్లీ, సోడా వర్తకుల సంఘం భవనంలో ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. ఆ భవనం పాతది కావడం, వర్షం కురిసిన సమయంలో భవనంలోని గదుల్లో నీరు పడుతుండటంతో అక్కడ కార్యాలయాన్ని నడపలేమని సిబ్బంది చెప్పడంతో ఆ ప్రయత్నం విరమించారు. ఆ తర్వాత చింత చెట్టు సెంటరులో ఉన్న మీసేవా కేంద్రం భవనంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ భవనం బాగానే ఉన్నా ఏదో కారణం చూపి అక్కడ ఏర్పాటు చేయకుండా నిలిపివేశారు. తదుపరి కాలేఖాన్‌పేట, పరిసర ప్రాంతాల్లో నూతన తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు కోసం అద్దెభవనం తీసుకుంటామని చెబుతూ కాలయాపన చేయడమే తప్ప భవనాన్ని మాత్రం ఎంపిక చేయలేదు. దక్షిణ మండల పరిధిలోని ప్రజలకు అందుబాటులో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని గత నెలలో జరిగిన గ్రామసభల్లో ఈ మండల పరిధిలోని సర్పంచ్‌లు, కూటమి నాయకులు, ప్రజలు మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకువచ్చారు.

మిగతా 6లో..



వరదొస్తే ఎడ్లబండే దిక్కు

వరదలు వచ్చినప్పుడల్లా పాత ఎడ్లంక వాసులు పడే అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఇటీవల వచ్చిన కృష్ణానది వరదలకు గ్రామానికి వెళ్లే కాజ్‌వే రహదారి కొట్టుకు పోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం కృష్ణానదికి కొద్దిపాటి వరద రావడంతో ఎడ్ల బండ్లపై ఇలా రాకపోకలు సాగించారు. - అవనిగడ్డ రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి)




దుర్గమ్మ సన్నిధికి పోటెత్తిన భక్తులు

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనం కోసం ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. క్యూలలో బారులుతీరి మరీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో రద్దీ ఏర్పడటంతో శీఘ్ర దర్శనం కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

6లో

భూమి, రైతుతోనే మానవాళి మనుగడ

రైతునేస్తం అవార్డుల ప్రదానోత్సవంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



6లో

నేటి నుంచి పోలీసు అమరవీరుల ఉత్సవాలు



దుర్గమ్మ దర్శనం కోసం క్యూలలో వేచిఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వన్‌టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనం కోసం ఆదివారం వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు. క్యూలలో అమ్మవారి దర్శనం చేసుకున్నారు. రద్దీ ఏర్పడటంతో శీఘ్ర దర్శనం కోసం అధికారులు ఏర్పాటు చేశారు. మహిళా భక్తులు అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఈవో రామారావుతో కలిసి క్యూలో భక్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కల్పిస్తున్న సౌకర్యాలను గురించి భక్తులకు వివరించారు. సామాన్య భక్తులకు దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు.



ఆదివారం పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు, వేదపండితులు లోక కల్యాణం కోరుతూ సూర్యోపాసన సేవచేశారు. సూర్యనారాయణ స్వామి చిత్రపటానికి అర్చనలు చేశారు. అరుణ పారాయణం చేశారు. ఆలయంలో వృద్ధులు, దివ్యాంగులకు మెట్ల మార్గంలో ఏర్పాటు చేసిన వీల్‌ఛైర్ పనితీరును ఈవో రామారావు పరిశీలించారు.

సుబ్బారాయుడి సేవలో దేవదాయశాఖ అదనపు కమిషనర్



స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు చంద్రకుమార్‌కు అందజేస్తున్న ఈవో

మోపిదేవి : దేవదాయ శాఖ అదనపు కమిషనర్ బి.చంద్రకుమార్ కుటుంబసమేతంగా మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు చంద్రకుమార్‌కు అందజేశారు.



కళాశాల వసతిగృహంలో భోజనాలను పరిశీలిస్తున్న న్యాయాధికారి

వసతిగృహాల్లో న్యాయాధికారి ఆకస్మిక తనిఖీ

అవనిగడ్డ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాలుగు వసతిగృహాలను అవనిగడ్డ న్యాయాధికారి బాబునాయక్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా? లేదా అన్న విషయమై రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అవనిగడ్డలోని బీసీ బాలికల వసతిగృహం, సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహం, బాలికల వసతిగృహాన్ని, కళాశాల విద్యార్థుల వసతిగృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహాల్లో మరుగుదొడ్లు సరిగా ఉన్నాయా, భోజన వసతి ఎలా ఉందనే విషయాలను పరిశీలించారు. వసతిగృహ భవనం శిథిలావస్థకు చేరిన విషయాన్ని పరిశీలించి సంక్షేమ అధికారిణి అనురాధను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట న్యాయవాదులు నరహరిశెట్టి ఈశ్వరరావు, చిట్టిప్రోలు ప్రసాద్, దామెర్ల నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సనకా రఘురామ్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి పోలీసు అమరవీరుల ఉత్సవాలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల స్మారకోత్సవాలు సోమవారం నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఎస్పీ ఆర్. గంగాధరరావు తెలిపారు. సోమవారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో విధి నిర్వహణలో అసువులుబాసిన అమరవీరులకు నివాళులర్పిస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొంటారన్నారు. 22 నుంచి 31వ తేదీ వరకు పోలీసు స్టేషన్లలో ఆయుధాలు, సాంకేతిక ఉపకరణాలతో ఓపెన్ హౌస్ నిర్వహిస్తామన్నారు. 24 నుంచి 27 వరకు సైబర్ నేరాలను అరికట్టడంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, కళాశాలలు, పాఠశాలల్లో పోలీసు అధికారులతో చర్చా వేదికలు, దేశభక్తిని చాటే చిత్రాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. 28 నుంచి 30వరకు పోలీసు బ్యాండ్ షోలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 30న అమరవీరుల కుటుంబాలకు సన్మాన కార్యక్రమం చేపడతామన్నారు. 31న ఏక్తాదివస్ కార్యక్రమం కింద ఉదయం యూనిట్ రన్, సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తామన్నారు.

24 నుంచి ట్యాలీ ప్రైమ్ విత్ జీఎస్టీ కోర్సులో ఉచిత శిక్షణ

ఉంగుటూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్, సైబర్ గ్రామీణ కంప్యూటర్ శిక్షణా సంస్థలో ఈనెల 24నుంచి ట్యాలీ ప్రైమ్ విత్ జీఎస్టీ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్టు సంస్థ ఇన్‌చార్జి జి.అంకమ్మరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఫైనాన్షియల్ అకౌంటింగ్ సెక్టార్‌లో మెరుగైన ఉపాధి అవకాశాలు గల ఈ ట్యాలీప్రైమ్ కోర్సులో శిక్షణ పొందేందుకు బీకామ్/ఎంకామ్, బీబీఏ/ఎంబీఏ చదివి, 18నుంచి 35సం. మధ్య వయసుగల తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. కోర్సు కాలవ్యవధి రెండునెలలు, శిక్షణాకాలంలో అభ్యర్థులకు శిక్షణతోపాటు భోజన, వసతి సౌకర్యాలు పూర్తిగా ఉచితమన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడంలో సంస్థ పూర్తి సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లోని నిరుద్యోగయువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9100033552, 9440630051 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పాలకాయితిప్ప గేట్లు మూసివేత

కోడూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి శివారు పాలకాయితిప్ప బీచ్ గేట్లు ఈ నెల 22వ తేదీ వరకు మూసివేస్తున్నట్టు మెరైన్ సీఐ సతీష్ రెడ్డి తెలిపారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పాలకాయితిప్పకు వచ్చిన సందర్శకులకు ప్రస్తుతం వాయుగుండం ఉన్నందున బీచ్ గేట్లు మూసివేసినట్టు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి హంసలదీవికి వచ్చే సందర్శకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



పాలకాయితిప్ప వద్ద గేట్లు మూసి కాపలా ఉన్న మెరైన్ సిబ్బంది

భూమి, రైతుతోనే మానవాళి మనుగడ

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఉంగుటూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతితోపాటు భూమిని కాపాడుకుంటూ, రైతును రక్షించుకుంటూ, పర్యావరణ హితానికి కృషిచేసినప్పుడే మానవజాతికి మనుగడ వుంటుందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు స్పష్టంచేశారు. వ్యవసాయరంగంలో అధునాతన శాస్త్రసాంకేతికతలను అందిపుచ్చుకునే విధంగా శాస్త్రవేత్తలు చొరవతీసుకోవాలని, వివిధ రకాల సామాజిక మాధ్యమాల ద్వారా వ్యవసాయ పరిజ్ఞానాన్ని రైతులకు మరింత చేరువచేసి, నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు సాధించే దిశగా అన్నదాతలకు ప్రోత్సాహాన్నందించాలన్నారు. రైతునేస్తం 20వ వార్షికోత్సవం సందర్భంగా ముప్పవరపు ఫౌండేషన్, రైతునేస్తం సంయుక్త ఆధ్వర్యంలో ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ (విజయవాడ చాప్టర్)లో జరిగిన రైతునేస్తం అవార్డుల ప్రదానోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన ప్రఖ్యాత వ్యవసాయశాస్త్రవేత్త పద్మశ్రీ అవార్డుగ్రహీత స్వర్గీయ ఐవీ సుబ్బారావు పేరిట ఏర్పాటుచేసిన అవార్డులను వ్యవసాయ అనుబంధరంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన పలువురు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసాధికారసంస్థకు జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేయడంతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 20మంది ప్రకృతి వ్యవసాయ రైతులను సతీసమేతంగా ఘనంగా సత్కరించి పురస్కారాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కరోనా సమయంలో అన్ని రంగాలు స్తంభించినా, రైతన్నల కాడీ, మేడీ మాత్రమే పనిచేశాయనీ.. మనల్ని రక్షించేది వ్యవసాయం మాత్రమేనని రుజువైందని గుర్తుచేశారు. చదువుకున్న యువత పల్లెబాట పట్టాలన్న ఆయన యువతరం రాకతో వ్యవసాయరంగం అద్భుతాలు సాధిస్తుందన్నారు. గత 20ఏళ్లుగా రైతునేస్తం మాసపత్రిక ద్వారా వ్యవసాయరంగంలో అన్నదాతకు చేదోడుగా నిలవడమేగాక, ఏటా ప్రోత్సాహక అవార్డుల కార్యక్రమాలు, 500పైగా సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటుచేసి లక్షలాదిమంది రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాలమీద అవగాహన కల్పించేందుకు రైతునేస్తం ఎడిటర్ వేంకటేశ్వరరావు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చెక్కభజనతో అందరినీ ఆకట్టుకున్న బాపట్ల జిల్లా మార్టూరు మండలం కొలలపూడి భజన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించి రూ. లక్ష బహుమానం అందజేశారు. 'రైతునేస్తం' 20 ఏళ్లపండుగ పురస్కరించుకుని తీసుకువచ్చిన ఆరు పుస్తకాలను ఆవిష్కరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్య, స్వర్ణభారత్ ట్రస్టు చైర్మన్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు

రైతునేస్తం సంపాదకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్లపల్లి వేంకటేశ్వరరావు మాట్లాడుతూ, గత 11సంవత్సరాలుగా రైతునేస్తం పత్రిక పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెద్దలు వెంకయ్యనాయుడు రావటం సంస్థ పూర్వజన్మ సుకృతమన్నారు. పల్లెల ప్రగతికి ప్రకృతి వ్యవసాయం దారిలో రైతులు సాగాలని, ఉత్పత్తుల మార్కెటింగ్‌కోసం కూడా మావంతు కృషిచేస్తామని చెప్పారు.

రాష్ట్ర రైతుసాధికార సంస్థ పక్షాన జీవన సాఫల్యపురస్కారం అందుకున్న సంస్థ వైస్‌ఛైర్మన్ టి.విజయకుమార్ మాట్లాడుతూ, ప్రగతికి ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన స్ఫూర్తితో మనరైతులు ఇతర దేశాలలో ప్రకృతి వ్యవసాయం మీద శిక్షణ, అవగాహన కల్పించే స్థాయికి ఎదగటం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో స్వర్ణభారత్‌ట్రస్ట్ ఛైర్మన్ కామినేని శ్రీనివాస్, ట్రస్ట్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛ బందరుకు కలిసి పనిచేద్దాం

- రోడ్లు శుభ్రం చేసిన మంత్రి రవీంద్ర, కూటమి నేతలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఫొటోలకు ఫోజులిచ్చేవారు కాకుండా నిజంగా పనిచేసేవాళ్లు నాతో పనిచేసేందుకు రండి.. బంగారు, స్వచ్ఛ బందరుగా తీర్చిదిద్దుదాం.. అని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం మూడు స్తంభాల సెంటర్ నుంచి చీపుర్లుపట్టి నేతలు రోడ్లు శుభ్రం చేశారు. పంపులచెరువు గట్టుపై పెరిగిన ముళ్ల పొదలను తొలగించారు. సుమారు నాలుగు గంటలపాటు జరిగిన శ్రమదాన కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేపీ ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీ, కూటమి నేతలు కొట్టె వెంకట్రావు, మాదివాడ రాము, మోటమర్రి బాబాప్రసాద్, కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, అన్నం ఆనంద్, ఎండీ ఇలియాస్, పిప్పళ్ల కాంతారావు, కుంచే నాని, గనిపిశెట్టి గోపాల్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, మునిసిపల్ కమిషనరు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. నగరంలో పారిశుధ్య కార్మికులతో కలిసి సమష్టిగా స్వచ్ఛ బందరు కార్యక్రమం చేపడతామన్నారు. జెడ్పీ సెంటర్‌ను శుభ్రం చేద్దామన్నారు. సీఎస్‌ఆర్ ఇతర నిధులతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. రూ.100 కోట్లతో పార్కులు, డ్రెయిన్లు, స్మశాన వాటికలు శుభ్రం చేద్దామన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు రూ.200లకే కుళాయి కనెక్షన్ అందిస్తున్నామన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

బాధితులకు అండగా ఉంటానని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం మంత్రి కార్యాలయంలో 14 మంది రోగులకు సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి రూ.29 లక్షల విలువగల చెక్కులను అందజేశారు. పేదల వైద్య సేవలకు అండగా ఉంటామన్నారు. కిడ్నీ బాధితులకు డయాలసిస్, ఆసుపత్రిలో స్కానింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.



చెరువు గట్టుపై ముళ్ల పొదలు తొలగిస్తున్న మంత్రి రవీంద్ర, కూటమి నేతలు

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి..

బుడమేరు వరద బాధితులకు మునిసిపల్ కార్మికులు చేసిన సేవలు.. వారి కాళ్లు కడిగినా రుణం తీర్చుకోలేమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వరద బాధితులకు సేవలందించిన 250 మంది పారిశుధ్య కార్మికులకు ఆదివారం పంపింగ్ హౌస్ వద్ద రూ. 5లక్షల విలువ గల దుస్తులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 250 మంది మునిసిపల్ కార్మికులకు తనవంతుగా పాదరక్షలు అందిస్తానన్నారు. పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. డంపింగ్ యార్డులో లక్ష టన్నులకు పైగా చెత్త పేరుకుపోయిందని, ఆరునెలల్లో ప్రత్యేక నిధులతో చెత్త సమస్యను తీరుస్తామన్నారు. సీఎం ఆదేశాలతో డంపింగ్ యార్డు స్థలంలో సుందరమైన పార్కు నిర్మిస్తామని, డంపింగ్ యార్డును రుద్రవరం తరలిస్తామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బాపిరాజు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



హైదరాబాద్ నగరంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

తాడంకి పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- ఘనంగా స్కూల్ వందేళ్ల సంబరానికి ప్రణాళికలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా తాడంకి జడ్పీ హైస్కూల్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న స్కూల్ పూర్వ విద్యార్థులంతా ఆదివారం వందేళ్ల సంబరాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. నగరంలోని తబలా హోటల్ జరిగిన ఈ కార్యక్రమానికి ఈ స్కూల్‌లో 50వ దశకంలో చదివిన వారు కూడా హాజరై పాత స్నేహితులతో కలిసి గత జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. స్నేహితులతో కబుర్లు చెప్పుకుంటూ సందడి చేసారు. ఈ స్కూల్‌లో 1953- 54లో పదోతరగతి బ్యాచ్‌కు చెందిన వ్యాపారవేత్త ప్రభాకరరావు, ప్రకాశరావులతో పాటు పూర్వ విద్యార్థులు రిటైర్డ్ డీఎస్పీ శాంతరామారావు, అనంత లక్ష్మి, ఎస్.వెంకటేశ్వరావు. పి.తిరుమల ప్రసాద్, వై.మస్తాన్‌రావు తదితరులు హాజరయ్యారు. జనవరి 12న తాడంకిలో జరిగే స్కూల్ వందేళ్ల ఉత్సవ వేడుకలకు స్నేహితులంతా తరలివెళ్లాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఈ స్కూల్ లో చదువుకున్న ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ప్రముఖ వైద్యులు నోరి దత్తాత్రేయ తదితరులంతా వందేళ్ల సంబరాలకు హాజరుకానున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



స్వచ్ఛత జీవితంలో భాగం కావాలి

- ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలి
- వాక్‌థాన్‌లో సినీహీరో సుధీర్ బాబు

విజయవాడ సిటీలైఫ్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : "అందరి జీవితంలో స్వచ్ఛత ఒక భాగం కావాలి.. మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.. ఇది నిత్య ప్రక్రియ.. నిరంతరం సాగాలి" అని సినీనటుడు సుధీర్‌బాబు అన్నారు. విజయవాడ ఆదాయపు పన్ను శాఖ 'స్వచ్ఛతా హి సేవ'లో భాగంగా ఆదివారం నిర్వహించిన 'వాక్‌థాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంజీ రోడ్డులో ఉన్న ఆదాయపన్ను శాఖ కార్యాలయం నుంచి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ మొగల్రాజపురంలోని ఆదాయపన్నుశాఖ కార్యాలయం వరకు సాగింది. మంచి లక్ష్యం కోసం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్ తరాల కోసం ఒక అడుగు ముందుకు వేసి ఇంటితోపాటు, పరిసరాలను, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 'స్వచ్ఛతా హి సేవ' గురించి మన చుట్టుపక్కల వారికి, కుటుంబసభ్యులకు, స్నేహితులకు అవగాహన కల్పించాలని కోరారు. తాను పుట్టి పెరిగింది విజయవాడలోనే అని గుర్తుచేశారు. ఎంజీ రోడ్డులో ఉన్న డీఆర్ఆర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ నేర్చుకున్నానని చెప్పారు. ఎంజీ రోడ్డులో వాకింగ్, రన్నింగ్ చేసేవాడినని యువతరం నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. నగర వీధులు అప్పటికి, ఇప్పటికి చాలా క్లీన్‌గా కనిపిస్తున్నాయని కితాబిచ్చారు. విజయవాడ ఆదాయపన్ను శాఖ ప్రధాన కమిషనర్ వీరేందర్ మెహెతా మాట్లాడుతూ, 'స్వచ్ఛతా హి సేవా రన్' ప్రచారంలో విద్యార్థులు పాల్గొనటం చాలా సంతోషదాయకమన్నారు. హైదరాబాద్ ఆదాయపు పన్ను శాఖ ప్రధాన కమిషనర్ సురేష్ బత్తిని మాట్లాడుతూ, ప్రధాని మోదీ చొరవను ముందుకు తీసుకెళ్లడం ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో విజయవాడ ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిల్లా, పెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డీజీ రాజేంద్రచౌదరి, గుంటూరు ఆదాయపు పన్నుశాఖ అదనపు కమిషనర్ సుప్రియ, విజయవాడ ఆదాయపు పన్నుశాఖ జాయింట్ కమిషనర్ అభినయ, ఆదాయపు పన్నుశాఖ అసిస్టెంట్ కమిషనర్ దోనేపూడి విజయ్ బాబు, ఆదాయపు పన్నుశాఖ అధికారులు శ్యామలాదేవి, ఈశ్వరరావు, రామ్ ప్రసాద్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



వాక్‌థాన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న హీరో సుధీర్‌బాబు

పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం



పెడన రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పెడన చేనేత కుటుంబానికి చెందిన పుచ్చల వీర కోట సుబ్రహ్మణ్యం ఎంపికయ్యారు. విజయవాడలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సమావేశం నిర్వహించి, యువతను చైతన్యవంతులను చేయాలన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా కార్యదర్శి డి.దినేష్ బాబు, ఎం.శిరీషల నేతృత్వంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సుబ్రహ్మణ్యం 2001, 2002, 2003 సంవత్సరాలలో వరుసగా స్ట్రాంగ్‌మెన్ ఆఫ్ ఆంధ్రగా గెలుపొందారు. 2004లో జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలో చాంపియన్‌గా నిలిచారు. అంతర్జాతీయ పోటీలలో అవకాశం వచ్చినప్పటికీ ఆర్థిక సమస్యలతో వెళ్లలేకపోయానని సుబ్రహ్మణ్యం తెలిపారు.

29 నుంచి సమ్మెలోకి..

'వైద్య మిత్ర' కాంట్రాక్టు ఉద్యోగులు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల పదోన్నతులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. 29 నుంచి సమ్మెలోకి వెళతామని ఏపీ వైద్యమిత్ర కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 17 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. చనిపోయిన సిబ్బందికి రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియో, రిటైరయిన వైద్యసేవ సిబ్బందికి రూ.10 లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. 25న ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తామని, 26, 27న నల్ల బ్యాడ్జీలతో హాజరవుతారని, 29 నుంచి సమ్మెలోకి దిగుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘ కార్యదర్శి పోతురాజు, డెస్నీపాల్, అనిత, పుష్పలత పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రచయిత్రి చంద్రలత రచించిన పుస్తకాలు ఆయువు పాట, నీలంపురాశి పుస్తకాల ఆవిష్కరణ పరిచయ సభ నగరంలోని శిఖర పాఠశాలలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఆయువు పాట పుస్తకాన్ని ప్రముఖ కథా రచయిత్రి సత్యవతి ఆవిష్కరించారు. ఆయువుపాట పుస్తకాన్ని చినుకురాజగోపాల్ సమీక్షించారు. ఆమె రచనల కోసం చేసే అధ్యయనాన్ని వక్తలు విశ్లేషణ చేశారు.

ఏడాదిన్నరగా వెతుకుతున్నారు!

(5వ పేజీ తరువాయి)

దక్షిణ మండలం పరిధిలోని ప్రాంతాలు ఇవీ..

మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలోని దక్షిణ మండలం పరిధిలోకి ఎస్ఎన్ గొల్లపాలెం, గుండుపాలెం, రుద్రవరం, కోన, పోలాటితిప్ప, చిన్నాపురం, భోగిరెడ్డిపల్లి, పెదయాదర, నెలకుర్రు, పల్లెతుమ్మలపాలెం పంచాయతీలను, మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20 నుంచి 39 డివిజన్‌లను చేర్చారు. ఈ మండలానికి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, గ్రామ పంచాయతీలు, రెవెన్యూ గ్రామాల వారీగా వీఆర్వోలు, ఇతర సిబ్బంది కూడా ఉన్నారు. కానీ భవనం మాత్రం ఏర్పాటు చేయడం లేదు.

ఉత్తరం మండల పరిధిలోని ప్రాంతాలు..

ఉత్తరం మండలం పరిధిలోకి పెదపట్నం, కానూరు, తాళ్లపాలెం, గోకవరం, మంగినపూడి, బుద్దాలపాలెం, తపసిపూడి, కొత్తపూడి, పొట్లపాలెం, బొర్రపోతుపాలెం, పోతేపల్లి, గోపువానిపాలెం, అరిసేపల్లి, హుస్సేన్‌పాలెం, కరగ్రహారం, మాచవరం, చిలకలపూడి ప్రాంతాలు వస్తాయి. అలాగే మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1 నుంచి 19 డివిజన్లు, 40 నుంచి 50 డివిజన్లు ఉన్నాయి. ఈ మండలానికి గత నెలాఖరు వరకు తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీనివాస్ పదవీ విరమణ చేశారు. వేరెవరినీ తహసీల్దార్‌గా నియమించకుండా, దక్షిణ మండల తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా నియమించి కాలం వెళ్లదీస్తున్నారు. 30 ఏళ్లుగా మచిలీపట్నం మండలాన్ని రెండుగా విభజించాలని కోరుతూ వచ్చామని, ఇన్నేళ్లకు ప్రభుత్వం అనుమతినిస్తే నూతన మండలానికి తహసీల్దార్ కార్యాలయం భవనం ఏర్పాటు చేయకుండా జాప్యం చేస్తున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తరతరాల స్ఫూర్తి రాణి అహిల్యాబాయి

- కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ

విజయవాడ కల్చరల్ అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళాశక్తికి ధైర్యం, సామాజిక సేవలకు ప్రతీకగా నిలిచి, తన నిష్పత, దృఢత్వంతో పాలనలో పురోగతిని సాధించిన వీరమహిళ రాణి అహిల్యాబాయ్ హోల్కర్ అని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమన్వయ సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన తరతరాల స్ఫూర్తి రాణి అహిల్యాబాయ్ పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అహిల్యాబాయ్ శాంతియుత పరిపాలనఅందించడంలో సమానత్వాన్ని ప్రోత్సహించడంలో ప్రజల సంక్షేమానికి చేసిన కృషి దేశచరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఆమె సత్రాలను పునరుద్ధరించిన పుణ్యశీలి అన్నారు. శివాజీ తల్లి జిజియాబాయ్, ఝాన్సీలక్ష్మి గురించి మాత్రమే ఎక్కువ మందికి అవగాహన ఉందని , ఇంతటి గొప్ప చారిత్రక వైభవం కలిగిన అహిల్యాబాయ్ గురించి నేటి తరానికి తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. నాటి కాలంలోనే మహిళా సాధికారతను ప్రోత్సహించారని, తన బిడ్డకు కులాంతర వివాహం జరిపించి కులమత బేధాలకు అతీతంగా సమానత్వాన్ని సాటిందన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ అధ్యక్షురాలు విజయభారతి మాట్లాడుతూ అహిల్యాబాయ్ హోల్కర్ మహిళా హక్కుల గురించి చారిత్రక నిదర్శనంగా నిలిచిందన్నారు. ఆమె భర్త మరణం తర్వాత సామ్రాజ్యాన్ని సమర్థంగా పాలించి, నేటి మహిళలకు నాయకత్వం, సామాజిక న్యాయం, ఆర్థిక స్వాతంత్ర్యం అనే హక్కుల్ని వినియోగించడంలో స్ఫూర్తినిచ్చిందన్నారు. మహిళలు తమ హక్కులను ఉపయోగించుకోవాలనీ పిలుపునిచ్చారు. సమస్యలు ఎదురైతే కేవలం పోలీస్ స్టేషన్‌కే పరిమితం కాకుండా మానవ హక్కుల కమిషన్‌ను సంప్రదించవచ్చునన్నారు. మానవ హక్కుల కమిషన్ దృష్టికి వచ్చిన చాలా ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు తీసుకున్నామన్నారు. పశ్చిమబెంగాల్, విశాఖపట్నం, కదిరి వంటి ఘటనల దృష్ట్యా తీసుకొన్న చర్యలను వివరించారు. ఐఏఎస్ అధికారిణి సృజన మాట్లాడుతూ అహిల్యాబాయ్ హోల్కర్ ఎందరో మహిళకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. సేవాతత్పరత, యుద్ధనీతి, ఆధ్యాత్మికత వంటి అనేక గొప్పపార్శ్వాలు ఆమెలో ఉన్నాయన్నారు. పుస్తకాన్ని విజయభారతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర సహసంఘ సంచాలకుడు దూసి రామకృష్ణ, బొమ్మరాజు సారంగపాణి, సాహితీ నికేతన్ డైరెక్టర్ బి.పవన్ కుమార్, మహిళా సమన్వయ కన్వీనర్ ఎన్.మాధురి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132,141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన

పెనమలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ మల్లినేని రాగూర్, ఉయ్యూరు కేసీపీ రోటరీ ఆసుపత్రి ఆధ్వర్యంలో రైతుకోసం పేరుతో నిర్వహించిన ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరానికి ఆదివారం విశేష ఆదరణ లభించింది. వైద్యశిబిరానికి షుమారు నాలుగు వందలకు పైగా స్థానికులు వచ్చి కంటి పరీక్షలు చేయించుకొన్నారు. ఈ పరీక్షల్లో కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి వచ్చే నెల 7న ఉయ్యూరులో చేయనున్నారు. కార్యక్రమానికి ముందుగా స్థానిక రైతులకు పవర్ స్ప్రేయర్లు, రక్షణ పరికరాలు, మహిళలకు రాగూర్ చేతుల మీదుగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెనమలూరు ఎన్నారై ప్రతినిధులు పాలడుగు సుధీర్, కోగంటి వెంకటేశ్వరప్రసాద్, కిలారు ప్రవీణ్, మోర్ల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రసాదంపాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో సోమవారం 8.30 నుంచి 11.30 మధ్య విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ పరమేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎనికేపాడు ప్రధాన రహదారి, జెండాచెట్టు సెంటర్, విజయ ఆగ్రోకట్ట, హరిజనవాడ, రైల్వేకట్ట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

హనుమాన్ జంక్షన్ ఎస్సైగా సురేష్

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జంక్షన్ ఎస్సైగా ఆదివారం వెలుగుల సురేష్ బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ పోర్ట్ పోలీస్ స్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏడీఎల్ జనార్దన్ గన్నవరం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఎస్సైకు ఘనంగా స్వాగతం పలికారు. ఎస్సై-2గా ఇక్కడ పనిచేసిన ఆర్జమ్మ ఎన్నికలు నేపథ్యంలో బదిలీపై వెళ్లారు.



భక్తులకు ఆశీస్సులు అందిస్తున్న బాబా

ఘనంగా గ్యార్మీ వేడుక

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విజయవాడ రోడ్డులోని హనుమాన్‌నగర్ మహమ్మద్ అక్బర్ షరీఫ్ ప్రార్థన మందిరం నిర్వాహకులు మహబూబ్ సుభానీ (బాబా) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా 17వ గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. ఈ వేడులకు కుల మతాలకు అతీతంగా భక్తులు పాల్గొని బాబా ఆశీస్సులు స్వీకరించారు. ఈ సందర్భంగా వేలాది మందికి అన్నసమారాధన చేశారు.



పవర్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న బసవరావు

క్రీడాకారులను ప్రోత్సహించాలి

గన్నవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తే పతకాలను సాధిస్తారని ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు అన్నారు. మండలంలోని కేసరపల్లి జడ్పీహైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను పొట్లూరి బసవరావు సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, జడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణిలతో కలసి ప్రారంభించారు.

189 మందికి వైద్య పరీక్షలు

గన్నవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు అభినందనీయమని సర్పంచ్ ఈలప్రోలు వాసు అన్నారు. మండలంలోని సూరంపల్లి జడ్పీ హైస్కూల్‌లో విజయవాడ ఎంజె నాయుడు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాసు మాట్లాడుతూ, కార్పొరేట్ వైద్యాన్ని గ్రామీణ ప్రాంతాలకు చేరువ చేయటం గొప్ప విషయమన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీపీ షుగర్, థైరాయిడ్, ఈసీజీ, న్యూరో, ఆర్థో సమస్యలపై పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ శిబిరంలో 189 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వావిలాల రజనీకాంత్ శర్మ, డాక్టర్లు జ్యోతి, గీతిక, పవిత్ర, సందీప్ పాల్గొన్నారు.

రైతుబజార్‌లో మెరక పనులు

ఉయ్యూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు రైతుబజార్ ఆవరణలో మెరకపనులు ఆదివారం ప్రారంభించారు. రైతుబజార్ ఆవరణ పల్లపై వర్షం వచ్చినప్పుడు నీరు నిలచి బురదకయ్యగా తయారవడంతో వినియోగదారులు, రైతులకు అసౌకర్యం కలుగుతున్న వైనాన్ని శనివారం రైతుబ జార్‌లో సబ్సిడీ టమాటా స్టాల్‌ను పరిశీలించేందుకు వచ్చిన వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కమిషనర్ విజయసునీత దృష్టికి వినియోగదారులు, రైతులు తీసుకువచ్చారు. ఈ మేరకు స్పందించిన అధికారులు మెరక చేసేందుకు రెండు లారీల క్వారీడస్ట్ ఏర్పాటు చేశారు. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాసరావు పల్లపు ప్రాంతాల్లో మెరకపనులు ప్రారంభించారు.



ఉయ్యూరు రైతుబజార్‌లో మెరక పనులు చేస్తున్న కూలీలు

హడలెత్తిస్తున్న గ్రామసింహాలు!

- నిత్యం దాడులతో భయపడుతున్న స్థానికులు
- ప్రధాన రహదారుల్లో ద్విచక్ర వాహనాదారులపై దాడి
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



కంకిపాడు ప్రధాన రహదారిపై గుంపులుగా కుక్కలు

(కంకిపాడు - ఆంధ్రజ్యోతి)

మండల పరిధిలోని ప్రధాన రహదారులపై వీధి కుక్కల బెడద రోజు రోజుకు తీవ్రం అవుతోంది. కుక్కలు దాడులు చేస్తుండటంతో పలువురు గాయాలపాలై ఆసుపత్రుల పాలవుతున్నారు. రహదారుల వెంట వెళ్లే ప్రజలు, మూగజీవాలు, పశువులపైకి కుక్కలు పరుగులు తీసి దాడులు చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి వెంట కుక్కలు వెంబడిస్తుండటంతో వారు ప్రమాదాల బారినపడుతున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో తెల్లవారుజామున కొందరు వాకింగ్‌కు, స్కూల్స్, పనులకు వెళ్లే వారు కుక్కల బారిన పడి గాయాలపాలవుతున్నారు. మండలం కేంద్రమైన కంకిపాడు, ఉప్పలూరు, ఈడుపుగల్లు, మద్దూరు, నెప్పల్లి, ప్రొద్దుటూరు పంచాయతీల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పిల్లలు భయపడుతున్నారు



పిల్లలు ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటే భయ పడుతున్నారు. ఏ వీధిలో చూసినా గుంపులు, గుంపులుగా కుక్కలే కనిపిస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం మా అపార్టుమెంటులోని ఓ చిన్నారి వెంటపడ్డాయి. పక్కన ఉన్నవాళ్లు కర్రలతో కొట్టి తరిమేశారు.

\- ఎం అనురాధ

అధికారులు పట్టించుకోవడం లేదు



మండల కేంద్రమైన కంకిపాడుతో పాటు అనేక గ్రామాల్లో కుక్కల బాధ ఎక్కువగా ఉంది. వాహనదారుల వెంట పడుతున్నాయి. రోడ్లపైకి రావాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

\- పి. రవికుమార్

పల్లె ప్రగతికి తొలి ప్రాధాన్యం

- గన్నవరం సమగ్రాభివృద్ధికి సుస్థిర ప్రణాళిక
- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- మండలంలో రూ. 6.16 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



తెంపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యత నిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. మండలంలో తెంపల్లి, వీరపనేనిగూడెం, కొత్తగూడెం, గొల్లనపల్లి, మాదలవారిగూడెం, సూరంపల్లి, ముస్తాబాద, పురుషోత్తపట్నం, వీఎన్‌పురం కాలనీ, దావాజీగూడెం, బుద్ధవరం, అజ్జంపూడి, కేసరపల్లి, జక్కులనెక్కలం గ్రామాల్లో రూ.6.16 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు పల్లె పండుగలో భాగంగా ఆదివారం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకుడు వడ్రాణం హరిబాబు నాయుడు, చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, జొన్నలగడ్డ రంగమ్మ, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, కొండేటి వెంకటేశ్వరరావు, గొల్లన పల్లి సర్పంచ్ గణపవరపు శాంతి, యనమదల సతీష్, రామినీడు బసవపూర్ణయ్య, సూరంపల్లి సర్పంచ్ ఈలప్రోలు వాసు, గొట్టిపూళ్ల వీరబాబు, దేవరపల్లి కోటేశ్వరరావు, మండవ అన్వేష్, మేడేపల్లి రమ, శ్రీనాథ్ పాల్గొన్నారు.



అయాన కన్వెన్షన్ సెంటర్ ఎండీ రాజశేఖర్, చైర్మన్ మనోజ్‌లకు అవార్డు అందజేస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

అయానకు 5 స్టార్ రేటింగ్

వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు ప్రదానం

కంకిపాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నాణ్యతాప్రమాణాలు, వినియోగదారుల సంతృప్తి వ్యాపారుల ప్రధాన లక్ష్యమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. హెచ్.వై.ఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ సంస్థ నిర్వహించిన సర్వేలో అయాన కన్వెన్షన్ సెంటర్‌కు 5 స్టార్ రేటింగ్ సర్టిఫికెట్‌ను ఆదివారం ప్రకటించింది. కంకిపాడులోని అయాన కన్వెన్షన్ సెంటర్‌లో ఓ వివాహ వేడుకకు హాజరైన ఆయన ఈ సర్టిఫికెట్‌ను కన్వెన్షన్ సెంటర్ ఎండీ రాజశేఖర్, చైర్మన్ మనోజ్‌లకు అందజేశారు. హెచ్.వై.ఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ సంస్థ ఎండీ శివయ్య అల్లపాటి మాట్లాడుతూ, హెచ్.వై.ఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో ప్రపంచస్థాయి నాణ్యతా ప్రమాణాలు పాటించటంలో అయాన కన్వెన్షన్ సెంటర్ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పరిపాలన విభాగం, ఆహార భద్రత, నాణ్యతాప్రమాణాలు, పచ్చదనం, సోలార్ వినియోగం వంటి అనేక అంశాలను పరిశీలించిన అనంతరం అయాన కన్వెన్షన్ సెంటర్ ఎండీ రాజశేఖర్, చైర్మన్ మనోజ్‌లకు ఈ 5 స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు ఆటవిడుపు అవసరం: ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ప్రాణదాతలైన వైద్యులకు ఆటవిడుపు ఎంతగానో అవసరమైన కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. డాక్టర్ స్పోర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ సీజన్ - 6 జెర్సీలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. పావని కన్స్ట్రక్షన్స్ చైర్మన్ పాకలపాటి వీర రాఘవరావు మాట్లాడుతూ, నగరంలోని 12 ప్రముఖ హాస్పటల్స్ ఫ్రాంచైజీలుగా ఉన్న ఈ మెగా టోర్నమెంట్‌లో 160 మంది వైద్య నిపుణులు పాల్గొంటున్నారని తెలియజేశారు. ఈ నెల 23 నుంచి టోర్నమెంట్ ప్రారంభమవుతుందన్నారు. డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమి ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రశాంత్ కుమార్, కార్తీక్ తుమ్మల, పావని కన్స్ట్రక్షన్స్ డైరెక్టర్ సాయి శ్రీ హర్ష పాకలపాటి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానిస్తున్న అకాడమి నిర్వాహకులు

పీడీఎఫ్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

ఉయ్యూరు, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : రానున్న గుంటూరు కృష్ణా నియోజకవర్గ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో పీడీఎఫ్ నుంచి పోటీ చేస్తున్న కె.ఎస్.లక్ష్మణరావు విజయానికి కలసికట్టుగా కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు అన్నారు. స్థానిక విజ్ఞాన కేంద్రంలో ఆది వారం జిల్లాలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, నేటి ప్రభుత్వాలు సామాజిక దృక్పథం విడిచి కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నాయని, వాటికి వ్యతిరేకంగా వామపక్ష అభ్యుదయ భావాలు కలిగిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. మండలాల వారిగా పట్టభద్రులైన ఓటర్లను చేర్పించే ప్రక్రియ చేపట్టాలని పిలుపు నిచ్చారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా బాధ్యులు పీవీ రమణ, హబీబ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వరరావు, శివనాగేంద్రం, అన్నే సుబ్బారావు పాల్గొన్నారు.



అవార్డులతో వాసవీ క్లబ్ సభ్యులు

వాసవీ క్లబ్‌కు అవార్డుల పంట

ఉయ్యూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : వాసవీక్లబ్ ఉయ్యూరు సర్కిల్‌కు వివిధ సేవా అంశాలకు సంబంధించి పలు అవార్డులు లభించినట్టు సర్కిల్ అధ్యక్షుడు వూర కిషోర్‌కుమార్ తెలిపారు. విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఆదివారం జరిగిన రీజినల్ కాన్ఫరెన్స్ సమావేశం లో క్లబ్ కార్యవర్గానికి అవార్డులు ప్రదానం చేశారు. సూపర్ బెస్ట్ ప్రసిడెంట్, బెస్ట్ సర్వీస్, బెస్ట్ ట్రెజరర్, బెస్ట్ సెక్రటరీ, బెస్ట్ ఆర్సీ విజిట్, బెస్ట్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అవార్డులు రీజియన్ చైర్‌పర్సన్ బోడా భీమరాజు, ఇంటర్నేషనల్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రసిడెంట్ కనమర్లపూడి శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్ తడికమళ్ల బ్రహ్మానందం నుంచి అందు కున్నట్టు కిషోర్ కుమార్ తెలిపారు.

పేదల సేవలో కమ్మవారి ఐక్య సేవా సమితి

- నిత్యావసరాలు, స్టీలు సామను పంపిణీ



పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న పరుచూరి రామకృష్ణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పేదలకు అవసరమైన సేవలందించడంతో పాటు ఆపత్కాలంలో కమ్మవారి ఐక్య సేవా సమితి అండగా నిలుస్తుందని అధ్యక్షుడు పరుచూరి రామకృష్ణ తెలిపారు. రంగయ్యప్పారావుపేట, వేలేరు, బాపులపాడు శివారుల్లో నివశించే దిననరి వేతన కుటుంబాలకు ఆదివారం బియ్యం, నిత్యావసరాలు, స్టీలు సామను అందజేశారు. చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిగులూరి ఫణీంద్ర, ధీరజ్, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదుకు ప్రత్యేక కౌంటర్

ఉయ్యూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఓటర్ల నమోదుకు తన కార్యాలయంలో సోమవారం జరిగే మీ కోసం కార్యక్రమంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ సురేశ్ తెలిపారు. ప్రొవిజినల్ సర్టిఫికెట్, ఓటర్ ఐడెంటీ కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజు ఫోటోతో నమోదు చేసుకోవాలన్నారు.

భళారే ఖిల్లా..!

కొండపల్లి కోటకు పూర్వ వైభవం వచ్చినట్టేనా..?

తెలుగు నాట ఎంతో ప్రాచుర్యం ఉన్న కొండపల్లి ఖిల్లా (గిరిదుర్గం) శత్రుదుర్భేద్యమైన దుర్గం. సహజ వనరులకు, ప్రకృతి సంపదకు పెట్టింది పేరు. కొండపల్లి ఖిల్లా పేరు చెప్పగానే ఎత్తైన భవనాలు, రాతి బురుజులు, రాజమహల్లోని పెద్ద కొలనులు, అడుగడునా రాజసం ఉట్టిపడేలా అలనాటి చారిత్రక కట్టడాలు, ఎన్నో కళాఖండాలు కళ్ల ముందు కదలాడుతుంటాయి. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన కొండపల్లి కోట వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో ఆ ప్రాభవాన్ని కోల్పోయింది. కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో పర్యాటకులు లేక నిర్మానుష్యంగా మారి బోసిపోతోంది. - ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి



నిరుపయోగంగా లేజర్ షో ప్రదర్శించిన ప్రొజెక్టర్స్

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఓ వెలుగు వెలిగిన ఖిల్లా
- లేజర్ షోలతో కోట, రాజుల చరిత్ర ప్రజలకు తెలిపిన చంద్రబాబు
- ప్రపంచ పర్యాటక కేంద్రాన్ని నిర్లక్ష్యం చేసిన మాజీ సీఎం జగన్

2014 -19 మధ్య కొండపల్లి ఖిల్లాకు మహర్దశనే చెప్పాలి. నవ్యాంధ్ర ఏర్పడిన తర్వాత పురావస్తుశాఖ ఈ కోటపై దృష్టి సారించింది. అప్పటి, ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి పర్యాటకానికి పెట్టని కోటగా కొండపల్లి ఖిల్లాను తీర్చిందేందుకు, పర్యాటక ఆకర్షణ కేంద్రంగా మెరుగులు దిద్దేందుకు రూ.10 కోట్లు వెచ్చించి కోటకు కొత్తరూపు తెచ్చారు. కనుమరుగవుతున్న కోటకు తిరిగి జీవం పోశారు. ప్రపంచ పర్యాటక కేంద్రంగా కొండపల్లి కోటను తీర్చిదిద్దేందుకు ఉత్సవాలు నిర్వహించి అద్భుతంగా పునరుద్ధరించారు. రాజుల చరిత్రతో పాటు కోట చరిత్ర, విశిష్టతను తెలుపుతూ లేజర్ షో ప్రదర్శించారు. అందరి దృష్టి కొండపల్లి ఖిల్లాపై పడేలా చేయడమే కాక కోట అణువణువూ చూసేలా రూట్ మ్యాప్ కూడా సిద్ధం చేశారు.



పర్యాటకులు లేక బోసిపోతున్న ఖిల్లాలోని కోట ప్రాంతం

కళతప్పిన ఖిల్లా

వైసీపీ సర్కార్‌లో కొండపల్లి ఖిల్లా పూర్తి నిర్లక్ష్యానికి గురైంది. ఐదేళ్ల పాలనలో ఒక్క రూపాయి కూడా విదిల్చలేదు. దీంతో క్రమం క్రమంగా పర్యాటకులు ఖిల్లాను మర్చిపోయే పరిస్థితి నెలకొంది. 2014-19 మధ్యకాలంలో ఎందరో విదేశీయులు సైతం కొండపల్లి ఖిల్లాను సందర్శించారు. అప్పట్లో పర్యాటకుల సందడితో కోటలో జాతర జరుగుతుందా అనిపించేలా పర్యటకులు వచ్చి పోతుండేవారు. చంద్రబాబు ప్రభుత్వం మారి 2019లో వైసీపీ రావడంతో కోటకు శని పట్టినట్టయింది. 2019-24 వరకు కోట దయనీయ స్థితికి చేరింది. కనీసం వసతులు లేక కునారిల్లింది. ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం రాకతో మళ్లీ కొండపల్లి ఖిల్లాకు పూర్వ వైభవం వస్తుందనే ఆశాభావాన్ని పర్యాటకులు వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో నిర్వహించిన లేజర్ షో ప్రొజెక్టర్లను అధికారులు ఇటీవల పరిశీలించినట్టు తెలుస్తోంది.



పసరతో నిండిన కోనేరు నీరు

సమస్యల తిష్ట

ఖిల్లాకు వెళ్లే రహదారిపైకి చెట్లు చొచ్చుకొస్తున్నాయి. వర్షాలకు కొండ చరియలు విరిగి పడుతున్నాయి. దీంతో కొండపైకి వెళ్లే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. కొండపై ఉన్న టీవీ టవర్‌లో ఉద్యోగాలు వెళ్లేవారు సైతం రహదారి బాగోక ఇబ్బందులు పడుతున్నారు. ఇక కోట లోపలున్న లేజర్ షో ప్రొజెక్టర్స్ నిరుపయోగంగా ఉంది. సీసీ కెమెరాలు పని చేయడం లేదు. అత్త కోడళ్ల కోనేటిలో నీరు పూర్తిగా పాడైంది. కోటలో అనేక సమస్యలు తిష్ట వేయడంతో పర్యాటకుల సంఖ్య పడిపోయింది.

చూడదగ్గ ప్రదేశాలు



మూడంస్తుల రాతి బురుజు, కొండ చుట్టూ శత్రు దుర్భేద్యమైన ప్రాకారం, దర్బార్ నిర్వహించే రాజ్‌మహల్, రాణి పరిహారం నివాసం ఉండే రాణిమహల్, నర్తనశాల, అంగడి, కారాగారం, ఆయుధాగారం. కొలనులు, రాజమహల్‌పై తీర్చిదిద్దిన కళాకండాలు, వీరుపాక్షి దేవాలయం, ప్యాలెస్ సమీపంలో లోతైన జలాశయం, ధాన్యాగారం, ఇలా అనేక చూడదగ్గ ప్రాంతాలున్నాయి. అయితే ప్రస్తుతం ధాన్యాగారం గబ్బిలాలకు నిలయంగా మారింది. అక్కడ ఏదైనా చప్పుడయితే గబ్బిలాల గోలకు చెవులు చిల్లులు పడే పరిస్థితి.



రహదారిపైకి వచ్చేస్తున్న ముళ్ల పొదలు

ప్రయాణ సౌకర్యాలు మృగ్యం

కోటకు వెళ్లాలంటే 6 కిలో మీటర్ల మేర అటవీ మార్గంలో ఇరుకు రహదారిలో వెళ్లాల్సి ఉంది. ఇబ్రహీంపట్నం నుంచి నేరుగా కోటకు బస్సు లేదు. ప్రైవేటు వాహనాల్లో వెళ్లాలంటే అధిక భారం. సాయంత్రమైతే నిర్మానుష్యంగా ఉంటుంది.

కావాల్సిన సౌకర్యాలేంటి..!

కోటకు వెళ్లేందుకు గతంలో చంద్రబాబు హయాంలో రోప్ వే నిర్మాణానికి ప్రతిపాదనలు జరిగాయి. కానీ కార్యరూపం దాల్చలేదు. జాతీయ రహదారి నుంచి కోటకు లింక్ రహదారితో పాటు కొండపల్లి వైపు నుంచి కోటకు రోప్ వే నిర్మాణం చేయాలి. అంతేకాక ఖిల్లా సందర్శనకు వచ్చే వారికి ఫుడ్‌కోర్టులు, తాగునీరు, మరుగుదొడ్ల వంటివి కల్పించాలి. ఈ దిశగా ప్రభుత్వం, పురావస్తుశాఖ దృష్టి సారించి కోటకు పూర్వవైభవం తేవాలి.

కను విందు జలపాతాలు

కొండపల్లి అటవీ ప్రాంతంలో 11 పెద్ద జలపాతాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. వాటికి తెలుగులో నామకరణాలూ ఉన్నాయి. కొంగుధార (కొండపల్లి), నెమలిధార (మూలపాడు), క్షీరలింగ జలపాతం (మూలపాడు), మాదులమ్మ తీర్థం (దొనబండ), సప్తస్వర ధారలు (దొనబండ), చిట్టి తుంబురు కోన (దొనబండ), సీతాకోకలగుండం (మూలపాడు), వనమాలి జలపాతం (కొండపల్లి), బేబి చిత్రకూట్ (కొండపల్లి), జడల కొలను (కొండపల్లి)

కోట లోపలికి వెళ్లే దారి తెరవాలి సయ్యద్ అహమ్మద్ కిర్మాని



అనారోగ్యంగా ఉన్న వారు మొక్కుకొని దర్గాలో పూజలు చేసి పాయసం చేసుకొని కోటలో ఉన్న గాలిబ్‌షహెద్ బాబాకు చెందిన గుర్రపు పాదాలు వద్ద కొంత పోసి తిరిగి దర్గా వద్దకు వచ్చి అందరికీ పంచుతాం. అయితే దర్గా వైపు నుంచి కోటకు వెళ్లేదారిని మూసివేశారు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. అత్యంత లోతైన చెరువు పక్కనే ఉన్న చిన్న కాలిబాట ద్వారా కోటలోకి వెళ్లాల్సి వస్తుంది. దీంతో పిల్లలు, వృద్ధులు అందులో పడిపోతారేమోనని భయపడుతున్నాం. గేట్లు తెరిచి ఉంచి టికెట్ కౌంటర్ కూడా ఏర్పాటు చేస్తే మంచిది.



పున్నమి ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించిన మునిసిపల్ కమిషనర్ ధ్యాన చంద్

పున్నమి ఘాట్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యం

విద్యాధరపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పున్నమిఘాట్‌లో ఈనెల 22న నిర్వహించనున్న డ్రోన్ షో సందర్భంగా పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తున్నట్టు వీఎంసీ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. ఈ సందర్భంగా ఆయన పున్నమిఘాట్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఘాట్‌లో రైలింగ్ వద్ద పేరుకున్న చెత్తను, వ్యర్థాలను చూసిన తొలగించాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా నిర్దేశిత ప్రాంతాల్లో తాగునీటి పాయింట్లు, మొబైల్ టాయ్‌లెట్లను ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కమిషనర్ (ప్రాజెక్టులు) డాక్టర్ డీ చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీ ఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ సురేష్‌బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ (వర్క్స్) పీ సత్యనారాయణ, ఈఈ ఏఎస్ఎన్ ప్రసాద్, ఇన్‌చార్జ్ అమృత్ జాయింట్ డైరెక్టర్, యూసీడీ పీవో డాక్టర్ లత, పబ్లిక్ రిలేషన్ అధికారి రజియా షబీనా కమిషనర్ వెంట ఉన్నారు.

రేపటి నుంచి ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భారతీయ నవీన క్రీడా ఉత్సవ్ (బాకు) ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీతారామపురంలోని ఓ ప్రైవేటు స్కూల్ వేదికగా ఈ నెల 22 నుంచి 27 వరకు తొలి అంతర్జాతీయ ఫిడే చెస్ ఫెస్టివల్-2024 పేరిట ఫిడే చెస్ టోర్నీ నిర్వహిస్తున్నట్టు స్కూల్ డైరెక్టర్ కే రాజేంద్ర తెలిపారు. ఈ మేరకు స్కూల్ ఆవరణలో ట్రోఫీలను, బ్రోచర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో తాము ఈ టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్నామని, తొలిసారి అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ విజయవాడ వేదికగా జరగడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. బాకు సెక్రటరీ విత్తనాల కుమార్ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడానికి ఆంధ్రా చెస్ అసోసియేషన్ సౌజన్యంతో ఫిడే రేటింగ్ చెస్‌ను నిర్వహిస్తున్నామని వెయ్యి మంది క్రీడాకారులు ఎంట్రీలు సమర్పించారన్నారు. ఈ టోర్నీలో రూ.15లక్షల ప్రైజ్‌మనీతో పాటు ట్రోఫీలను అందిస్తామన్నారు. టోర్నీ కన్వీనర్ షేక్ ఖాసీమ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉదయ్‌కుమార్, తాళ్ల నరేశ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు 22న ఉదయం పోటీలను ప్రారంభిస్తారని, ఇద్దరు గ్రాండ్‌మాస్టర్లు సప్తర్షిరాయ్ (2291 ఫిడే పశ్చిమబెంగాల్), ఎంఆర్ వెంకటేష్ (తమిళనాడు గ్రాండ్‌మాస్టర్) సహా 14మంది ఇంటర్నేషనల్ గ్రాండ్‌మాస్టర్లు విచ్చేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ మందుల రాజీవ్ పాల్గొన్నారు.

సెంచరీలతో కదం తొక్కిన రేవంత్, హర్ష

సీకే నాయుడు క్రికెట్ మ్యాచ్‌లో పట్టుబిగించిన ఆంధ్ర -373/2

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 20: ఆకాశమే హద్దుగా ఆంధ్ర బ్యాటర్లు చెలరేగి సెంచరీలతో కదం తొక్కారు. దీంతో మూలపాడు వేదికగా బీసీసీఐ నిర్వహించిన సీకే నాయుడు ట్రోఫీ మల్టీ డేస్ అండర్-23 క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ప్రత్యర్థి జట్టు మేఘాలయపై తొలిరోజే పట్టుబిగించింది. మూలపాడు దేవినేని వెంకట రమణ గ్రౌండ్స్‌లో ఆంధ్రా-మేఘాలయ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన మేఘాలయ ఆతిథ్య జట్టు ఆంధ్రను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తొలి వికెట్ పార్టనర్‌షిప్‌గా రేవంత్‌రెడ్డి (186 పరుగులు, 158 బంతుల్లో 19 ఫోర్లు,5 సిక్సర్లు), హర్షవర్ధన్ (149 నాటౌట్, 187 బంతుల్లో 10 ఫోర్లు, 7 సిక్స్‌లు) 324 బంతుల్లో 324 పరుగులను జోడించారు. దీంతో తొలిరోజు ముగిసే సమయానికి 373/2 నిలిచింది. సుబ్రహ్మణ్యం 26 పరుగులతో క్రీజులో ఉన్నారు. మేఘాలయ బౌలర్ సంతోష్ రెండు వికెట్లను తీశాడు.

వీబీఎఫ్ఎస్ అధ్యక్షుడిగా లక్ష్మయ్య

విజయవాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ (వీబీఎఫ్ఎస్) 2024-25 సంవత్సరానికి కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. విజయవాడలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా కె.లక్ష్మయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జక్కంపూడి ప్రసాద్, కార్యదర్శిగా టి.మనోహర్‌నాయుడు, సహాయ కార్యదర్శి కొండపల్లి రవి, కోశాధికారిగా జి.లక్ష్మి ఎన్నికయ్యారు. వర్కింగ్ కమిటీ సభ్యులు గోళ్ల నారాయణరావు, విశ్వేశ్వరరావు, కొల్లూరి, ఎ.భాస్కరరావు, బి.రవి కుమార్, కె.శ్రీనివాస్, వి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ నాగిరెడ్డి, పి.సుబ్రహ్మణ్యం, జె.నరసింహమూర్తి ఎన్నికయ్యారు. ఈ ఏడాది నవంబరులో విశాఖపట్నంలో పుస్తక మహోత్సవం నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

- టీయూసీ నేత జార్జ్

ధర్నాచౌక్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక సంఘాల ఐక్యతతోనే హక్కులను సాధన జరుగుతుందని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీ) కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఛార్లెస్ జార్జ్ కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. టీయూసీ ఏపీ కమిటీ 5వ మహాసభ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల చట్టాలకు వ్యతిరేకంగా సంఘటిత ఉద్యమాల ఆవశ్యకత ఉందన్నారు. వ్యవసాయరంగంలోని నల్లచట్టాలు, పారిశ్రామికరంగంలోని నాలుగు లేబర్ కోడ్‌లను తిప్పి కొట్టాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఎం.ప్రసాద్, పోలవరపు కృష్ణా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా, ఉపాధ్యాక్షుడిగా మరీదు మహేష్, సహాయకార్యదర్శిగా కంభంపాటి రాము, కోశాధికారిగా గానుగపాటి ప్రసన్నతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.



ఫించన్లు పంపిణీ చేస్తున్న సంఘం నేతలు

వృద్ధులు, వితంతువులకు పెన్షన్ల పంపిణీ

ధర్నాచౌక్, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): తమ సంఘం ఆధ్వర్యంలో ప్రతినెలా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు అందజేస్తున్నామని వెలమ సంక్షేమ సంఘం నేతలు పేర్కొన్నారు. భవిష్యత్‌తో దీన్ని కొనసాగిస్తామన్నారు. గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయం వద్ద ఆదివారం పెన్షన్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఘంటా శ్రీనివాసరావు, సిరిపురపు కిరణ్‌కుమార్, కోశాధికారి గంటా శ్రీనివాసరావు, గంటా మల్లేశ్వరి, కొప్పిశెట్టి సీత రామారావు, నల్ల రామారావు, గొట్టపు గోవర్ధనరావు పాల్గొన్నారు.

లెనిన్ సెంటర్ ఆక్రమణ

కవి విశ్వనాథ సత్యనారాయణ విగ్రహం కమ్మేశారు

లెనిన్ సెంటర్‌లోని కవి విశ్వనాథ సత్యనారాయణ విగ్రహం ఎదురుగా గతంలో ఒక వరుసలోనే 4 తోపుడు బళ్లుండేవి. ప్రభుత్వం మారగానే 3 వరుసలు పెంచి, దారి మూసేసి, 12 షాపులు పెట్టారు. పబ్లిక్ వెళ్లడానికి వీల్లేకుండా, విగ్రహానికి దారి లేకుండా చేశారు. పోనీ అవి పేదలవి అనుకుంటే పప్పులో కాలేసినట్టే. అధికార పార్టీకి చెందిన చోటామోటా నేతలు రోడ్డును ఆక్రమించి ప్లేస్‌లు విడగొట్టి, వేలాది రూపాయలు గుడ్‌విల్ తీసుకుని, అద్దెలకిస్తున్నారు.



నెలవారీ మామూళ్లు..

ఎన్నో ఏళ్లుగా పాతుకుపోయి హవా సాగిస్తున్న ఇద్దరు వ్యక్తులు దాదాపు 26 బళ్లు పెట్టి అద్దెలకిస్తూ, దందా కొనసాగిస్తున్నారు. ప్రజాప్రతినిధికి నెలవారీ మామూళ్లు చెల్లించాలంటూ దాదాగిరి చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఆశ్చర్యం ఏమిటంటే ఒక్కడికి 16 బళ్లు, అతని బంధువుకు 10 బళ్లున్నాయి. వీటిని అద్దెకిచ్చి వసూలు చేస్తారు. ఇందుకోసం ఒక గుమస్తాను ఏర్పాటు చేశారని చిరువ్యాపారులు ఆరోపిస్తున్నారు. సకాలంలో అద్దె చెల్లించకపోతే బెల్ట్ తీసి బెదిరిస్తున్నారని ఎదురు తిరిగితే పోలీసు కేసులు బనాయిస్తున్నారని వాపోయారు.

షాపుల కోసం నేతల పోటీ

ఆంధ్రజ్యోతి, గవర్నర్‌పేట: లెనిన్ సెంటర్ ఆక్రమణదారుల చెరలో చిక్కుకుంది. కొత్త ప్రభుత్వం రాగానే కూటమి నేతలు లెనిన్ సెంటర్‌పై కన్నువేశారు. ఉన్న షాపులు తొలగింపునకు కుట్రలు చేస్తూనే కొత్త షాపుల ఏర్పాటుకు స్థలాన్ని కబ్జా చేస్తున్నారు. పాత నీరు పోయి కొత్తనీరు వచ్చిందన్న సామెతను నిజం చేస్తూ ప్రభుత్వం మారగానే కొత్త హాకర్లకు రేట్లు కట్టి స్థలాలు ఇస్తున్నారు. బళ్లు పెట్టిస్తున్నారు. పబ్లిక్‌కు అసౌకర్యం కలిగిస్తున్నా పోలీసు, మున్సిపల్ సిబ్బంది పట్టనట్టే వ్యవహరిస్తున్నారు. హాకర్ల పేరుతో ఒకవైపు, ఆటోస్టాండ్ పేరుతో మరోవైపు లెనిన్ సెంటర్‌ను పంచుకున్నారు.

బీసెంట్ రోడ్ బ్లాక్


తోపుడు బళ్ల పేరుతో ఆక్రమణదారులు లెనిన్ సెంటర్ నుంచి ఏలూరు రోడ్డుకు వచ్చే (సౌత్ ఇండియా షాపింగ్ మాల్ తూర్పువైపు) బీసెంట్ రోడ్డు వైపు వాహనాల రాకపోకలకు అవకాశం లేకుండా చేశారు. కేవలం నడకదారిని మాత్రమే మిగిల్చారు. అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలు పబ్లిక్ స్థలాలు ఆక్రమించి, వీధి వ్యాపారులకు అద్దెలకిచ్చి, బతికేస్తున్నారని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. చందన బ్రదర్స్ రోడ్డులో నూడిల్స్ బళ్ల వ్యాపారుల ఆగడాలకు అంతే లేదని, రోడ్డును ఆక్రమించడమే కాక వెనుక ఉన్న పార్కులో పీటలు, బల్లలు వేసి పెద్దపాటి హోటల్స్‌నే నడిపేస్తూ సందర్శకులు పార్కుకు వచ్చే పరిస్థితి లేకుండా చేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వీరిదే హవా...

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వీళ్లే ముందు ప్రజాప్రతినిధిని బుట్టలో వేసుకుని తమను కాపాడుకుంటారని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కండెలు అమ్ముకునే వారి నుంచి కూడా నేత బర్త్‌డే వేడుకలకు రూ.500 వసూలు చేస్తారని ఆరోపిస్తున్నారు. పోలీసు అవుట్ పోస్టులోనికి వెళ్లే దారిని కూడా ఆక్రమించి అద్దెలకిచ్చారు. సిటీ బస్సులు వెళ్లేందుకు దారి లేకుండా పూలకొట్లు, చెప్పుల షాపులు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తెస్తున్నారని ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టడం లేదని వారు వాపోతున్నారు.



ప్రజల ఇబ్బందులు పట్టించుకోని అధికారులు



సౌత్ ఇండియా షాపింగ్ మాల్ రోడ్డులో ఆక్రమణలు

యువత నైపుణ్యం పెంచుకోవాలి

- నైపుణ్యాభివృద్ధి సంస్థ సీఈవో గణేష్ కుమార్

విజయవాడ కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): యువతకు కావాల్సిన నైపుణ్యం పెంపొందించడంతోపాటు చక్కటి ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా స్కిల్ సెంటర్ సెంటర్ పనిచేస్తుందని స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో జి. గణేష్ కుమార్ అన్నారు. ది ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అమరావతి చాప్టర్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు హోటల్‌లో హెచ్‌ఆర్ కాంక్లేవ్ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గణేష్‌కుమార్ మాట్లాడుతూ వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని, సరైన స్కిల్స్ లేని కారణంగా యువతను ఎంపిక చేయలేకపోతున్నామని ఆయా కంపెనీలు చెబుతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రత్యేకంగా యువతలో నైపుణ్యతను పెంపొందించేందుకు దేశంలోనే తొలిసారిగా స్కిల్ సెన్సెస్ నిర్వహిస్తున్నామన్నారు. ఎస్టీపీఐ(సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా) విజయవాడ సెంటర్ జాయింట్ డైరెక్టర్ బి.వినయకుమార్ మాట్లాడుతూ ఇటీవల పెద్ద కార్పొరేట్ సంస్థలు వచ్చాయని, యువతకు ఉపాధి కల్పిస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవడానికి ఈ సదస్సులు ఉపయోగపడతాయన్నారు. ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు దాసరి రామకృష్ణ మాట్లాడుతూ ఐటీ అసోషియేషన్ సంస్థ విద్యార్థుల్లో ముఖ్యంగా యువతలో స్కిల్స్‌ను పెంపొందించేందుకు, పరిశ్రమకు ఎటువంటి సిబ్బంది అవసరమో తెలియచేసేందుకు తొలిసారిగా హెచ్‌ఆర్ కాంక్లేవ్ నిర్వహించినట్టు తెలిపారు. హెచ్‌సీఎల్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శివ ప్రసాద్, ఐటీఏపీ చైర్మన్ ఇంద్రజిత్, అధ్యక్షురాలు లక్ష్మీ ముక్కవిల్లి పాల్గొన్నారు.

పాలవ్యాపారి అనుమానాస్పద మృతి

గుణదల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పాలవ్యాపారి అనుమానాస్పద స్థితిలో చనిపోయినట్టు పటమట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పటమట పంటకాల్వ రోడ్డులో తల్లి నాగమణితో కలిసి నివాసం ఉంటున్న ధూళిపాళ రామకృష్ణ (43) పాల వ్యాపారం చేసి జీవనం సాగిస్తుంటాడు. గత కొంతకాలంగా రామకృష్ణ ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్టు సమాచారం. సదరు మహిళ నమ్మకంగా ఉంటూ తరచూ నగదు తీసుకోవడం తిరిగివ్వకపోవంతో రామకృష్ణ అప్పులపాలయ్యాడు. దీంతో ఆ మహిళ రామకృష్ణను దూరంపెట్టడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదివారం ఫ్యానుకు ఉరేసుకుని చనిపోయాడు. ఈనెల 11న నిడమానూరులోని బంధువుల ఇంటికి వెళ్లిన తల్లి నాగమణి తిరిగి అదేరోజు ఇంటికి చేరుకుంది. లోపలికి వెళ్లి చూడగా కుమారుడు విగత జీవిగా కనబడటంతో పటమట పోలీసులకు తెలిపింది. పటమట సీఐ పవన్ కి షోర్, ఎస్ఐ హరికృష్ణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృ తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పటమట సీఐ పవన్ కిషోర్ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి కార్మికుడు మృతి

విద్యాధరపురం,అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పుస్తకాల ప్రింటింగ్ యూనిట్‌ను వేరేచోటికి మారుస్తున్న క్రమంలో ఇనుప ర్యాక్‌లను మారుస్తుండగా విద్యుత్ తీగలు తగిలి కార్మికుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. విజయవాడ రూరల్ కొత్తూరు తాడేపల్లికి చెందిన ఇస్లావత్ కొండకు శివకుమార్ (27), రాములు (23) సింగ్‌నగర్‌లోని పైపుల రోడ్డులో ఉన్న ఎస్ఆర్ పబ్లికేషన్స్‌లో ఏడేళ్లుగా పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకే విధుల్లోకి వచ్చారు. పైపుల రోడ్డు నుంచి కామకోటినగర్‌లోకి ప్రింటింగ్ యూనిట్‌ను మారుస్తున్న క్రమంలో కామకోటినగర్‌లో శివకుమార్ బీరువాలను దించుతుండగా వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు, అతడితో పాటు మరో కార్మికుడు నవీన్‌కు కూడా విద్యుత్ షాక్‌తగిలింది. కానీ శివకుమార్ అక్కడిక్కడే స్పృహ కోల్పోయాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న శివకుమార్ తండ్రి జరిగిన సంఘటనపై ఆరా తీశాడు. ఈ మేరకు తన కుమారుడు విద్యుత్ షాక్ తగిలి చనిపోయినట్టు భవానీపురం పోలీసులకు పిర్యాదుచేశాడు. ఎవరిపై తనకు అనుమానాలు లేవంటూ తెలిపాడు.

వృద్ధురాలి ఆత్మహత్య

కృష్ణలంక సుబ్బరాయనగర్ 5వ లైనుకు చెందిన ఆరేళ్ల సరస్వతి (70) ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ప్రాణాలను వదిలింది. భర్త రామారావు రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పట్నుంచి సరస్వతి మానసికస్థితి సరిగా లేక దిగులుతో ఉంటోంది. ఆమెకు నలుగురు కుమార్తెలు. ఒక కుమారుడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకులషెడ్డులో చీరతో ఉరేసుకుని మృతి చెందింది. ఆమె కుమారుడు నరేంద్ర కుమార్ కృష్ణలంక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవోపేతంగా లక్ష్మీగణపతి హోమం

గుడివాడ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మెయిన్‌రోడ్డులోని విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ఆశ్వయుజ మాసం బహుళ చవితి సంకటహర చతుర్థి వేడుకల్లో భాగంగా ఆదివారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. పూజల్లో 93మంది దంపతులు పాల్గొన్నారు. హోమగుండంలో పూర్ణాహుతిని సమర్పించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ శాయన రాజేష్, దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు(వాసు) పాల్గొన్నారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఈవో, ఉత్సవ కమిటీ చైర్మన్

పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి

• ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. మల్లాయిపాలెంలో నిర్వహించిన పల్లె పండుగలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రూ.1.47 కోట్లతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కూటమి నాయకులతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళి, ఎంపీడీవో విష్ణుప్రసాద్, చేకూరు జగన్మోహన్‌రావు, సమ్మెట బ్రహ్మాజీ, ఉంగరాల మురళి పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో ఎమ్మెల్యే రాముకు నోట్ పుస్తకాలు ఇచ్చి స్వాగతం పలుకుతున్న పొట్లూరి రవికుమార్, పోలవరపు వెంకట్రావు

రూ.2.02 కోట్లతో అంతర్గత రహదారుల అభివృద్ధి

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు, మామిడికోళ్ల, డోకిపర్రు, వెణుతురుమిల్లి, కౌతవరం గ్రామాల్లో పలు రహదారుల పనులకు ఎమ్మెల్యేవెనిగండ్ల రాము శంకుస్థాపన చేశారు. మండలంలో రూ.2.02 కోట్లతో 5 గ్రామాల్లో 31 అంతర్గత రహదారుల అభివృద్ధి పనులు చేపడతామ న్నారు. గుడ్లవల్లేరులో తొలి విడతగా 10 రోడ్లకు రూ.75.01లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తు న్నామని అన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జి), వల్లభనేని వెంకట్రావు, వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నులతో ఎమ్మెల్యేకు స్వాగతం

తానుగ్రామాలకు వచ్చినప్పుడు దండలు, ఫ్లవర్ బొకేలు ఇవ్వొద్దని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చెప్పిన దానిని పాటిస్తూ టీడీపీ యూనిట్ ఇన్‌చార్జ్‌లు పొట్లూరి రవికుమార్, పోలవరపు వెంకట్రావులు గుడ్లవల్లేరు వచ్చిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు పుస్తకాలు, పెన్నులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ పుస్తకాలను అవసరమైన పిల్లకు పంచమని పీఏ శశిని ఎమ్మెల్యే ఆదేశించారు.

నందివాడ మండలంలో..

నందివాడ: నందివాడ, జనార్దనపురం, గండేపూడి, పొనుకుమాడు గ్రామాల్లో సీసీ రోడ్లు, ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శంకుస్థాపన చేశారు. గుడివాడ నుంచి తమ గ్రామానికి వచ్చే ఆర్ అండ్ బీ రోడ్డు వేయించాలని పొనుకుమాడులో మహిళలు కోరారు. త్వరలోనే రోడ్డు వేయిస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. ఎంపీడీవో మల్లీశ్వరి, దానేటి సన్యాసిరావు, చాట్రగడ్డరవి పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.2.50 లక్షల విరాళం

జనార్దనపురం శివారు టెలిఫోన్ నగర్‌లో అయ్యప్పస్వామి దేవాలయానికి అన్నదానం నిమిత్తం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో దేవాలయ కమిటీ సభ్యులు సారం భవానీశంకర్ రాజు రూ.50 వేలు, వినాయక టూర్స్ అండ్ ట్రావెల్స్ అధినేత సింగవరపు ప్రభాకర్‌రావు రూ.50 వేలు, కుంపటి సుధీర్ కుమార్ రూ.50 వేలు, తట్టికొళ్ల వెంకట మురళీ అయ్యప్ప లారీ సర్వీస్ రూ.50 వేలు, తట్టికోళ్ల వంశీకృష్ణా రూ.50 వేలు మొత్తం రూ.2.50 లక్షలు అందజేశారు.



విశ్వభారతి పాఠశాల వద్ద దుర్గంధం



సంఘం బడి వద్ద..



రాజేంద్రనగర్‌లో..

కంపుకొడుతున్న గుడివాడ

• వార్డులో పేరుకుపోయిన చెత్త • వారం రోజులుగా నిలిచిన సేకరణ

(ఆంధ్రజ్యోతి-గుడివాడ): గుడివాడ పట్టణం కంపు కొడుతోంది. వారం నుంచి ఇంటింటి చెత్త సేకరణ నిలిచిపోవడంతో వార్డుల్లో చెత్త పేరుకుపోయింది. చెత్త సేకరించే వాహనాల డ్రైవర్లకు జీతాలు చెల్లించకపోవడంతో వారు విధులకు హాజరు కావడంలేదు. దీనికి ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారు.

నిలిచిన ఇంటింటి చెత్త సేకరణ....

ఇంటింటి చెత్త సేకరణ కోసం ప్రత్యేకంగా పారిశుధ్య వాహనాలను కాంట్రాక్ట్ పద్ధతిలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. జనవరి 2024 నాటి నుంచి అక్టోబరు వరకు ఎటువంటి జీతాలను చెల్లించలేదు. కాంట్రాక్టర్‌కు దాదాపుగా రూ.1.25కోట్లు బకాయి ఉన్నట్లు సమాచారం. చెత్త పన్ను(యూజర్‌చార్జీలు) వసూలు చేయడం ద్వారా డ్రైవర్లకు జీతభత్యాలను ఇచ్చేవారు. దసరా పండుగ నాటికి జీతాలు చెల్లించకపోవడంతో డ్రైవర్లు చెత్త సేకరణను నిలుపుదల చేశారు. దీంతో ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోయింది, దుర్గంధం వెదజల్లుతోంది.

పనికి రాని పుష్‌కార్టులు... సరిపడా లేని ట్రాక్టర్లు...

ఐదేళ్ల వైసీపీ పాలనలో మునిసిపాలిటీకి చెందిన ట్రాక్టర్లకు చిన్నపాటి మరమ్మతులు కూడా చేయకుండా వదిలేశారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం, మున్సిపాలిటీకి చెందిన ట్రాక్టర్లు, పుష్‌కార్టులను మరమ్మతులు చేయకుండా వదిలేశారు. పారిశుధ్య నిర్వహణ పేరుతో కోట్లల్లో సొమ్మును నొక్కేశారన్నా ఆరోపణలూ ఉన్నాయి. కైకాల కళామందిరం ఆవరణలో పుష్‌కార్టులను గుట్టగా పడేశారు. వినియోగానికి పనికి రాని విధంగా తయారయ్యాయి.ప్రసుత్తం20 పుష్‌కార్టులు అందుబాటులో ఉన్నా 36వార్డులకు వినియోగించలేరు. వార్డుకు 3 చొప్పున చెత్తసేకరణకు కనీసం 100 పుష్‌కార్టుల అవసరముంది. పాతపద్ధతిలో పుష్‌కార్టుల ద్వారా చెత్తను సేకరించాలనే ఆలోచన చేస్తున్నారు.

ప్రధాన రహదారులు శుభ్రం చేయిస్తూ..

వార్డుల్లో పరిస్థితి దారుణంగా ఉన్నా, ప్రధాన రహదారులను శుభ్రం చేయిస్తూ మున్సిపల్ అధికారులు మసిపూసి మారేడుకాయగా చేస్తున్నారు. సిబ్బంది సరిపడాలేరు. అదనంగా 90మంది అవసరం ఉంది.

కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

ఇప్పటికే వైరల్ జ్వరాలతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. వాతావరణ మార్పుతో పట్టణ ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. ప్రతి ఇంటిలో కనీసం ఇద్దరైనా వైరల్ జ్వరాల బారిన పడినవారే. చెత్త సేకరణపై అధికారులు దృష్టిపెట్టాలని లేని పక్షంలో తామంతా వ్యాధుల బారినపడతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెత్త సేకరణకు ట్రాక్టర్లు ఏర్పాటు

సమస్య పరిష్కారం అయ్యేలోపు అద్దె ప్రాతిపదికన మూడు ట్రాక్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. కొత్త పుష్‌కార్టులు కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అప్పటి వరకు చెత్తసేకరణ కొనసాగుతుంది.

శ్రీనివాస్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్



సైకిల్ షెడ్డు ప్రారంభోత్సవంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి కిరణ్మయి

పూర్వవిద్యార్థుల వితరణతో సైకిల్ షెడ్

కూచిపూడి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలం కూచిపూడిలోని సిద్ధేంద్ర జడ్పీ హైస్కూల్ 1984-85 విద్యార్థుల వితరణ రూ.2 లక్షలతో నిర్మించిన సైకిల్ షెడ్డును హైకోర్టు న్యాయమూర్తి, పాఠశాల పూర్వ విద్యార్థిని జస్టిస్ మండవ కిరణ్మయి పూర్వ విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. హెచ్‌ఎం వెంకట సత్యప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష

గుడివాడ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): భారత తపాలా శాఖ రాష్ట్ర వ్యాప్తంగా దీనదయాళ్ స్పర్శయోజన స్కాలర్‌షిప్ పరీక్షలు నిర్వహించింది. రాజేంద్రనగర్‌లోని విద్యాలయ పబ్లిక్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. 200మంది విద్యార్థులు హాజరయ్యారు. డివిజన్ తపాల శాఖ సూపరింటెండెంట్ చల్లా అప్పారావు, పోస్ట్‌మాస్టర్ ఎస్.శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నూతన అధ్యక్షుడిని సత్కరిస్తున్న ఉద్యోగులు

ఏసుబాబుకు అభినందన

పెదపారుపూడి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ టైపిస్ట్ అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్‌గా మండల ప్రజాపరిషత్ కార్యాలయ టైపిస్ట్ కొలుసు ఏసుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని తోటి ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

గుడివాడ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గుడివాడ అర్బన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ మరీదు కృష్ణమోహన్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రోహిణ్‌కుమార్ సౌజన్యంతో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 17వ వార్డులో సర్దార్ గౌతులచ్చన్న విగ్రహం వద్ద ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వైద్యశిబిరాన్ని సందర్శించారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, ఎనికేపాడు ఆధ్వర్యంలో కార్డియాలజీ, ఆర్థోపెడిక్, జనరల్, న్యూరాలజీ వైద్యులు వైద్యసేవలందించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ సహకారంతో అవసరమైన వారికి కళ్లజోళ్లను ఉచితంగా అందించారు.



సభ్యత్వ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఆర్థిక సహకారం

గుడివాడ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రానికి ఆర్థిక సహకారం అందిస్తోందని, పోలవరం నిర్మాణానికి నిధులను కేటాయించిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ అన్నారు. ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. సంస్థాగత నిర్మాణంలో భాగంగా బీజేపీ 20రోజులుగా సాధారణ సభ్యత్వాలను పూర్తి చేసి, క్రియాశీలక సభ్యత్వాల ప్రక్రియను ప్రారంభించామని ఆయన తెలిపారు. సభ్యత్వ నమోదు పుస్తకాలను ఆవిష్కరించారు. జిల్లా ఇన్‌చార్జ్ ఉన్నమట్ల కపర్థి, మచిలీపట్నం పార్లమెంట్ కన్వీనర్ నూరే గాంధీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుచ్చిరాజు, అయోధ్యరామయ్య, గణేష్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

పల్లె పండుగలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పెదపారుపూడి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా భూషణగుళ్ల, చిన్నపారుపూడి, యలమర్రు గ్రామాల్లో ఎమ్మెల్యే పలు సీసీ రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. పదిహేనేళ్లుగా యలమర్రు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. చలసాని రమేష్‌చౌదరి (చంటి), సూరపనేని వెంకట సత్యనారాయణ, కొల్లూరి అనూష ఎంపీడీవో పి.సీతామహాలక్ష్మి, ఈవోపీఆర్డీ వి.శ్రీనివాస్(వంశీ), తహసీల్దార్ రంగారావు, పంచాయతీ కార్యదర్శి డీసీహెచ్ శ్రీనివాస్, కాటమరాజు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

అంకమ్మ తల్లికి ఎమ్మెల్యే పూజలు

యలమర్రులో అంకమ్మ తల్లి సంబరాల సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం బిలీవర్స్ చర్చి అతిథి వార్షికోత్సవంలో పాల్గొన్నారు.



కొండిపర్రులో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రగతి పథంలో పంచాయతీలు

పామర్రు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన గ్రామ పంచాయతీలు పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ప్రగతి పథంలో పయనిస్తున్నాయని టీడీపీ కొండిపర్రు అధ్యక్షుడు నూకవరపు వీరాంజనేయులు అన్నారు. ఆదివారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.25.80 లక్షలతో గ్రామంలో నిర్మించే నూతన సీసీ రోడ్లకు అధికారులతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఉపసర్పంచ్ పసుపులేటి రుక్మిణి, పంచాయతీ కార్యదర్శి రాళ్లబండి సుబ్రహ్మణ్యం, పీఆర్ ఏఈ రామారావు, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీఓ సురేష్ పాల్గొన్నారు.



విజయభాస్కర్ తరఫున పురస్కారాన్ని అందుకుంటున్న పోలవరపు షరేన్

బొప్పన విజయభాస్కర్‌కు అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారం

గుడివాడ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యాలయ పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారాన్ని సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ అందజేసింది. గుంటూరు ఏసీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మలినేని గ్రూప్స్ అధినేత మలినేని పెరుమాళ్లు, ఎస్‌పీఎల్‌టీవో రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య నుంచి విజయభాస్కర్ తరఫున విద్యాలయ అకడమిక్ అడ్వైజర్ పోలవరపు షరేన్ పురస్కారాన్ని అందుకున్నారు. ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్, రామాంజనేయులు, శ్రావణ్‌కుమార్, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ అమృతవల్లి పాల్గొన్నారు.



అయాన కన్వెన్షన్ సెంటర్ ఎండీ రాజశేఖర్, చైర్మన్ మనోజ్‌లకు అవార్డు అందజేస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

అయానకు 5 స్టార్ రేటింగ్

వెంకయ్యనాయుడు చేతులు మీదుగా అవార్డు ప్రదానం

కంకిపాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నాణ్యతాప్రమాణాలు, వినియో గదారుల సంతృప్తి వ్యాపారుల ప్రధాన లక్ష్యమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. హెచ్.వై.ఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ సంస్థ నిర్వహించిన సర్వేలో అయాన కన్వెన్షన్ సెంటర్‌కు 5 స్టార్ రేటింగ్ సర్టిఫికెట్‌ను ఆదివారం ప్రకటించింది. కంకిపాడులోని అయాన కన్వెన్షన్ సెంటర్‌లో ఓ వేడు కకు హాజరైన ఆయన ఈ సర్టిఫికెట్‌ను కన్వెన్షన్ సెంటర్ ఎండీ రాజశేఖర్, చైర్మన్ మనోజ్‌లకు అందజేశారు. హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ సంస్థ ఎండీ శివయ్య ఆళ్లపాటి మాట్లాడుతూ, హెచ్.వై.ఎం ఇంటర్నేషనల్ సర్టిఫికే షన్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో ప్రపంచస్థాయి నాణ్యతా ప్రమాణాలు పాటించటంలో అయాన కన్వెన్షన్ సెంటర్ ప్రథమ స్థానంలో నిలిచిం దన్నారు. పరిపాలన విభాగం, ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాలు, పచ్చదనం, సోలార్ వినియోగం వంటి అనేక అంశాలను పరిశీలించిన అనంతరం ఈ 5స్టార్ రేటింగ్ సర్టిఫికేట్ ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ఈ కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పవర్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు

క్రీడాకారులను ప్రోత్సహించాలి

గన్నవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తే పతకాలను సాధిస్తారని ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు అన్నారు. మండలంలోని కేసరపల్లి జడ్పీహైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి పవర్‌లిఫ్టింగ్ ఛాంపి యన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను పొట్లూరి బసవరావు సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, జడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణిలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బసవరావు మాట్లాడు తూ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. నేటి యువత చదువుతో పాటు క్రీడలు కూడా తగిన ప్రాధాన్యతను ఇవ్వాల్సిన అవసరత ఉందన్నారు. అనంతరం సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ విభాగాల్లో పవర్‌లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ పోటీలను నిర్వహించారు.

140 మందికి కంటి పరీక్షలు

కూచిపూడి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మొవ్వ మండల శాఖ ఆధ్వర్యంలో కాశీభొట్ల నారాయణమూర్తి సహకారంతో సమత శంకర నేత్రచికిత్సాలయ(ఉయ్యూరు) కూచిపూడిలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ తేజస్వి 140 మందిని పరీక్షించారు. 20 మందికి కంటి శుక్లం ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. కూచిపూడి ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. రెడ్‌క్రాస్ మండల శాఖ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, ఏవో హనుమకుమార్, కూచిపూడి రోటరీ క్లబ్ అధ్యక్షుడు కోనేరు మంజునాథ్ పాల్గొన్నారు.



కొర్లపాడు రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాగిత



లక్ష్మీపురంలో సీసీ రహదారి భూమిపూజలో వెంకట్రామ్

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

బంటుమిల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పల్లె పండుగలో భాగంగా ఆదివారం అర్తమూరు, కొర్లపాడు గ్రామాల్లో సిమెంటు రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. స్వచ్ఛమైన తాగునీరు, రోడ్ల అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై దృష్టి పెడతానని కాగిత అన్నారు. కూనపరెడ్డి వీరబాబు, కాశీ, ఇల్లూరి లీలాకృష్ణ, భూపతి రమేష్, కాగిత బాలాజీ, అట్లూరి రమేష్, యలవర్తి నాగరాజు, చేబోయిన వెంకటేశ్వరరావు, యలవర్తి ప్రవీణ్, సిద్ధు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన

చల్లపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీపురంలో రూ.85.65 లక్షలతో నిర్మించతలపెట్టిన 18 సీసీ రోడ్ల పనులకు మండలి వెంకట్రామ్ ఆదివారం భూమిపూజ చేశారు. లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ దాసరి సురేష్, చల్లపల్లి సర్పంచ్ కృష్ణకుమారి, ఎంపీటీసీ సభ్యులు మాలెంపాటి శ్రీనివాసరావు, నూకల వెంకటేశ్వరరావు, చలపతిరావు, గొరిపర్తి సుబ్బారావు, కొల్లి రమేష్, నందగోపాల్, వీరబాబు, తోట మురళీకృష్ణ, బొందలపాటి సాంబశివరావు, బోలెం వెంకటేశ్వరరావు, సూదాని పూర్ణ, మద్దాల ఆంథోని, దోనేపూడి శిరీష, జి.వెంకట సుబ్బయ్య, ఈవో సిహెచ్.ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు

శక్తిగుడి వద్ద మంత్రి రవీంద్ర అన్నదానం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా మచిలీపట్నంలో ఆదివారం పలు దేవాలయాలు, ఆధ్యాత్మిక సేవా సంస్థల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. శక్తిగుడి వద్ద అన్న సమారాధనలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వరీ తదితర ఆలయాల వద్ద అన్నదానం జరిగింది.





గ్యార్మీ షరీఫ్ వేడుకలో ఎమ్మెల్యే కాగిత

గూడూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆకులమన్నాడులో ఆదివారం జరిగిన గ్యార్మీ షరీఫ్ వేడుకల్లో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. టీడీపీ నాయకులు పోతన స్వామి, గ్రామ సర్పంచ్ ఎండి రఫీ, ఎస్‌ఏ బేగ్, పోతుల రాము, ఎజ్జు శివాజీ, బర్కత్, బాషీ, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చలపతిరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి సజ్జా చలపతిరావు రూ.10 లక్షల విరాళం

చల్లపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లిలోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి గ్రామస్థులు, టీడీపీ సీనియర్ నాయకులు సజ్జా చలపతిరావు రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. మన కోసం మనం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో శ్మశాన వాటిక అభివృద్ధి జరుగుతోంది. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చేతుల మీదుగా మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ డీఆర్కే.ప్రసాద్‌కు విరాళం అందజేశారు. గతంలోనే రూ.5 లక్షల ఇచ్చిన ఆయన మిగిలిన రూ.ఐదు లక్షలను ఆదివారం అందజేశారు. సర్పంచ్ కృష్ణకుమారి, స్వచ్ఛ చల్లపల్లి రథసారధి డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.



గుల్లలమోదలో కుళ్లిన వరిని చూపుతున్న రైతులు

ఆదుకోవాలని రైతుల వేడుకోలు

నాగాయలంక, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు భావదేవరపల్లి, కమ్మనమోలు, నాలి, బర్రంకుల, పర్రచివర, గుల్లలమోద, గణపేశ్వరం, తలగడదీవి, దీనదయాళ్‌పురం, సొర్లగొందిలో 1000 ఎకరాలకుపైగా వరి పంటకు తీవ్ర నష్టం జరిగినట్టు అన్నదాతలు తెలిపారు. అవుట్ పాల్ స్లూయిస్‌లు సక్రమంగా పని చేయకపోవటంతో వరద నీరు పారుదల లేక వారాలు తరబడి నీళ్లలో మునిగిన వరి కుళ్లిపోయిందని వాపోయారు. వరి పొలాల్లోని వరద నీరును తొలగించి, ముంపు బారిన పడిన అన్నదాతలను ఆదుకోవాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

చిలుకోటికి ఎమ్మెల్యే కాగిత నివాళి

గూడూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిలుకోటి గోపాలకృష్ణ గోఖలే సంతాప సభ ఆదివారం చిట్టిగూడూరులో జరిగింది. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ నాయకులు గోఖలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, విశ్రాంత ఏఎస్పీ గోసాల మురళీ, పోతన స్వామి, గోపీ నాగబాబు, కాసగాని శ్రీనివాసరావు, ఎస్‌ఏ బేగ్, కట్టా మునీశ్వరరావు, వేము కోటేశ్వరరావు, కాట్రగడ్డ కృష్ణ, చింతగుంట కృష్ణ, గొరిపర్తి చంద్రశేఖర్, వాకా శ్రీను, శివరావు పాల్గొన్నారు.



మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం

నాగాయలంక, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా చిట్టా శివనాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా చిట్టా వీర అన్నపూర్ణయ్య, కోశాధికారిగా కొల్లూరు రామకృష్ణ ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా తూనుగుంట్ల శేషుబాబు, ప్రధాన కార్యదర్శిగా విస్సంశెట్టి హరీష్, కోశాధికారిగా చన్నగిరి నారాయణ, వాసవి సేవాదళ్ కన్వీనర్‌గా వంకాయల రాజేష్ (ఆది), కో-కన్వీనర్‌గా చిట్టా వెంకట శేఖర్‌రావు, కో-ఆర్డినేటర్‌గా మామిడి రాజగోపాల్ ఎన్నికయ్యారు. చిట్టా సాంబశివరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, ఘంటసాల రాజమోహన్ (కన్నయ్య) నిర్వహించారు.

రీ-సర్వేపై గ్రామసభలు రేపటి నుంచి

ఘంటసాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 22వ తేదీ నుంచి రీ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాలు ఉంటే రైతుల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కరిస్తామని తహసీల్దార్ బి.విజయప్రసాద్ తెలిపారు. ఈనెల 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు దాలిపర్రులో గ్రామసభ జరుగుతుందన్నారు. 23న కొత్తపల్లి, 24న పూషడం, 25న చిలకలపూడి, 26న మల్లంపల్లి, 27న బోర్లపాడు, 28న వి.రుద్రవరం, 29వ తేదీన తాడేపల్లి, దేవరకోట గ్రామాల్లో, 30న చిట్టూర్పులో గ్రామసభలు జరుగుతాయన్నారు.

హసీంబేగ్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పేదలను ఆదుకోవడంలో ఎంతో ఆనందం ఉందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పి.శ్రీరాం అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు హసీంబేగ్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం బస్టాండ్ సెంటర్‌లో పేదలకు అన్నదానం చేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు అశోక్‌బాబు, బొమ్మిడి అయ్యప్పస్వామి, ఆదిత్య, పెరుమాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

దావోజీపాలెంలో ఉచిత కంటి వైద్యశిబిరం

పెడన రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : దావోజీపాలెం విజయ అమలేశ్వరి దేవస్థానం ఆవరణలో అశ్విని ఫౌండేషన్ (విజయవాడ) ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడ చైతన్య కంటి ఆసుపత్రి వైద్యులు అంకెం శ్రీనివాస్, గీతా శ్రీనివాస్, చైతన్య, అరవింద్, నిఖిల మీనాక్షి 650 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 100 మందికి ఆపరేషన్లు చేయాలని గుర్తించారు. 350 మందికి ఉచితంగా కళ్లజోళ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. పి.రాజశేఖర్, రమేష్, సలీంబాబు, అంకెం శ్రీనివాసరావు పాల్గొన్నారు.